

బోనాలకు ముస్తాబైన సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి ఆలయం

హైదరాబాద్ వార్త

# చిన్నపాటి గొడవలు..'ఫ్యూచర్' తిప్పలు..!

- యువత దాడులతో క్రిమినల్ కేసులు
- అధికశాతం లవ్, పక్కవాడిలో జోక్యం
- హీరోయిజానికై తలదూరుస్తున్న ఘటనలు
- ఆరు నెలల్లో వందకు పైగా కేసులు

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** చిన్నపాటి గొడవలకే యువత చాలా సీరియస్‌గా వ్యవహరిస్తున్నారు. హీరోయిజం చూపించుకునేందుకు నలుగురు ఐదుగురు గుంపుతో వెళ్లి సెటిల్‌మెంట్‌లు.. కుదరకపోతే దాడులకు తెగబడుతూ కేసులు నమోదుచేయించుకుంటున్నారు. ఫ్యూచర్ తెలియక ప్రతి విషయంలో జోక్యం చేసుకుంటూ వ్యక్తిత్వాన్ని తనంతటా తానే దిగజార్చుకుంటున్నారు. జైలు,నేరస్తులుగా మారి జీవితాన్ని బుగ్గిపాలు చేసుకుంటున్నారు. కేసులతో ఉద్యోగాలకు అనర్హత వేటుపడుతుంది. ఇక సమాజం సైతం నేరస్తుడిగా చూడడంతో విలువ తగ్గడమే కాకుండా బంగారం లాంటి భవిష్యత్తును తాకట్టు పెడుతున్నారు. లవ్, సెటిల్‌మెంట్లు, పక్కవారిలో జోక్యం, ఫ్రెండ్స్ గర్ల్‌ఫ్రెండ్స్‌పై కామెంట్లు, ఈవ్ టీజీంగ్‌కు పాల్పడడం, డబ్బుల లావాదేవీలవంటి ఘటనలే అధికంగా ఉంటున్నాయి. ఇవే హత్యలకు దారితీసి నిందితులుగా మారుతున్నారు. గత ఆరునెలల్లో నగర కమిషనరేట్ పరిధిలో వందకు పైగా కేసులు నమోదైనట్లు పోలీస్ రికార్డులు చెబుతున్నాయి.



**ఒక్క కేసున్నా...ఉద్యోగాలకు అనర్హతే...**

నేరచరిత్ర ఉన్న వారిని సంస్థ యజమాన్యాలు ఉద్యోగాలకు నియమించుకునేందుకు విముఖత చూపుతారు. ఇక ప్రభుత్వ ఉద్యోగాలకైతే అనర్హత వేటే ఉంటుంది. ఇటీవల జరిగిన కొన్ని ఘటనలతో కేసులు నమోదయ్యాయి. గత నెల 30న స్నేహితుడు జన్మదిన వేడుకలకు వెళ్లిన తోటి స్నేహితుడు అయిన రౌడీషీటర్‌ను హత్య చేశారు. నెల క్రితం జీడిమెట్ల పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ మైనర్ బాలికను ప్రేమకు అడ్డొస్తుందని మైనర్లయిన ప్రియుడు, సోదరుడు కలిసి హత్య చేశారు. రెండు నెలల క్రితం బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకరిని పదిమంది యువకులు హత్య చేశారు. ఘటన స్థలంలో ఏదోసాధించినట్లు హీరోయిజాన్ని చూపుతూ చిందులేశారు. ఇలా ఎన్నో ఘటనలు నగరంలో చోటు చేసుకుంటున్నాయి. తెలిసి తెలియని వయస్సులో చిన్నపాటి ఫ్రెండ్స్ గొడువల్లో తలదూర్చడం, లవ్ ఎఫైర్, ఈవ్‌టీజింగ్ కేసులు ఇలా ఏమైన ఉంటే భవిష్యత్తు ఆగమ్యగోచరంగా మారుతుందని పోలీసు ఉన్నతాధికారులు చెబుతున్నారు. ఇంట్లో టీనేజీ వారిపై తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని సూచిస్తున్నారు. గాలికి వదిలేస్తే కుమారులు, కుమార్తెలు చెడుదారిలో వెళ్తూ జీవితాన్ని తాకట్టు పెట్టే ప్రమాదం లేకపోలేదంటున్నారు. సర్కిల్‌ను గమనించడంతో పాటు అలవాట్లు, డైలీ కార్యకలాపాలపై తెలుసుకోవాల్సిన అవసరం ఉందని మానసిక వైద్య నిపుణులు చెబుతున్నారు.

# ఓసి కావాలంటే..ఎన్‌వోసి తప్పనిసరి

- * బఫర్, రెవెన్యూ క్లియరెన్స్ అంటూ తిరకాసు
- * బెంబేలెత్తుతున్న బిల్డర్లు, యజమానులు
- * రెవెన్యూ, ఇరిగేషన్ ఇంజనీర్లకు కాసుల పండుగ

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో భవన నిర్మాణ అనుమతి, నిర్మాణం పూర్తయిన తర్వాత జారీ చేసే అక్యుపెన్సీ సర్టిఫికెట్(ఓసి) కోసం చెరువులకు సమీపంలో లేని భవనాలకు రెవెన్యూ ఎన్ఓసీ, సమీపంలో ఉన్న భవనాలకు బఫర్ క్లియరెన్స్ సర్టిఫికెట్లను తప్పనిసరిచేస్తూ జీహెచ్ఎంసీలో ఒక విచిత్రమైన నిబంధన అమలవుతుంది. భవన నిర్మాణ అనుమతి జారీచేసే సమయంలోనే నిర్మాణం చేపట్టనున్న ప్లేస్‌కు సంబంధించిన అన్ని రకాల డాక్యుమెంట్లతోపాటు లింకు డాక్యుమెంట్లను సైతం అన్ని కోణాల్లో పరిశీలించిన తర్వాతే నిర్మాణ అనుమతులు జారీ చేస్తున్న జీహెచ్ఎంసీ నిర్మాణం పూర్తయిన తర్వాత పది శాతం లోపు డీవియేషన్లున్నా, భవనాలకు జారీ చేయాల్సిన అక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం తాజాగా అర్థరహితమైన నిబంధనను తెరపైకి తేవటంతో నిర్మాణాలు చేపట్టే బిల్డర్లు, భవన యజమానులు బెంబేలెత్తుతున్నారు. నిర్మాణ అనుమతికి లోబడి పదిశాతం డీవియేషన్స్ కన్నా తక్కువ డీవియేషన్స్‌తో నిర్మాణం పూర్తయిన భవనాల అక్యుపన్సీ సర్టిఫికెట్ల కోసం బిల్డర్లు, గుత్తేదారులు లేక్స్, రెవెన్యూ ఆఫీసుల చుట్టూ ప్రదక్షిణలుచేయాల్సిన దుస్థితి ఏర్పడింది. ఈ సరికొత్త నిబంధనతో భవన నిర్మాణ అనుమతుల కోసం ఇప్పటి వరకు కేవలం జీహెచ్ఎంసీ అధికారులకు మాత్రమే అమ్యామ్యాలు సమర్పించుకునే పరిస్థితులుండగా, ఇపుడు సరికొత్త నిబంధనతో చెరువులు, నాలాలకు సమీపంలో లేకపోయినా, రెవెన్యూ, లేక్స్, ఇరిగేషన్ విభాగాలతో సంబంధం లేకపోయినా, ఈ మూడు విభాగాలకు సైతం అమ్యామ్యాలు చెల్లించాల్సిన దుస్థితి తలెత్తిందని బిల్డర్లు వాపోతున్నారు.



**చెరువులు కుంటలు...**

ఎల్బీనగర్, శేరిలింగంపల్లి వంటి ఐఏఎస్ ఆఫీసర్లు జోనల్ కమిషనర్లుగా ఉన్న ప్రాంతాల్లో చెరువులు,కుంటలు, నాలాలకు దగ్గరలో లేని భవనాల అక్యుపెన్సీ సర్టిఫికెట్ల కోసం క్లియరెన్స్ సర్టిఫికెట్లు అడగటంతో బిల్డర్లు, ఆర్కిటెక్చర్లు తలలు పట్టుకుంటున్నారు. బిల్డింగ్ నిర్మాణ అనుమతులు జారీచేసే ముందు ఏ మాత్రం అనుమానం వచ్చినా, ఇరిగేషన్, రెవెన్యూ ఎన్ఓసీలను అభ్యర్థించి, అవి సమర్పించిన తర్వాతే నిర్మాణ అనుమతులు జారీ చేస్తున్నారు. ఈ క్రమంలో నిర్మాణం పూర్తయిన తర్వాత అక్యుపెన్సీ సర్టి ఫికెట్ ఇచ్చేందుకు మళ్లీ ఇరిగేషన్, రెవెన్యూ ఎన్ఓసీల నిబంధన పెట్టడం ఎంత వరకు సబబు అంటూ బిల్డర్లు, భవన యజమానులు ప్రశ్నిస్తు న్నారు. ఈ నిబంధనను ఎత్తి వేయాలని కోరుతూ త్వరలోనే కొందర బిల్డర్లు సీఎం, మున్సిపల్ మంత్రి అయిన రేవంత్‌ను కలిసే అవకాశం కూడా లేకపోలేదు.

**కుదరని జాయింట్ ఇన్‌స్పెక్షన్లు...**

గ్రేటర్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో అయిదు అంతస్తులు, అంతకన్నా ఎక్కువ అంతస్తులతో నిర్మితమవుతున్న భవనాలకు ఇరిగేషన్, రెవెన్యూ విభాగాల నుంచి క్లియరెన్స్ సర్టిఫికెట్లు అభ్యర్థిస్తుండగా, ఈ విషయంలో రెవెన్యూ, ఇరిగేషన్ ఆఫీసర్లు జాయింట్ ఇన్ స్పెక్షన్ చేసి, ఉభయ విభాగాల మధ్య ఏకాభిప్రాయం కుదిరిన తర్వాతే సర్టిఫికెట్లు జారీచేస్తామని చెబుతున్నారు.

ఈ క్రమం లో ఈ రెండు విభాగాలకు చెందిన అధికారుల కలిసి జాయింట్ ఇన్‌స్పెక్షన్ చేసేందుకు సమయం కుదరక జాప్యం జరుగుతుందని మరి కొందరు బిల్డర్లు, భవన యజమానులు వాపోతున్నారు. అనుమతుల కోసం దరఖాస్తు చేసుకునే సమయం లోనే ఎన్ఓసీలు ఇచ్చిన తర్వాత, ఆ ఎన్ఓసీ ఆధారంగా అక్యుపెన్సీ సర్టిఫికెట్లు మంజూరు చేయాలని, ఒకసారి ఎన్ఓసీ జారీ చేసిన తర్వాత మళ్లీ ఎందకంటూ? కొందరు రెవెన్యూ, ఇరిగేషన్ విభాగం అధికారులు బిల్డర్లకు, భవన యజమానులకు సూచిస్తుండగా, ఇదే అదునుగా కొందరు ఇరిగేషన్ ఇంజనీర్లు, రెవెన్యూ అధికారులు బేరం కుదుర్చుకుని ఎన్ఓసీలు జారీ చేస్తూ, ఈ నిబంధనను సొమ్ము చేసుకుంటున్నట్లు కూడా ఆరోపణలున్నాయి.



టిటిడి చైర్మన్‌కు వినతిపత్రం అందచేస్తున్న అఖిల భారత పురాతన ఆలయాల పునరుద్ధరణ ట్రస్ట్ నాయకులు

## పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు తిరుమల తిరుపతి దేవస్థానం సహకరించాలి

### పురాతన ఆలయాల పునరుద్ధరణ ట్రస్ట్ నాయకుల విజ్ఞప్తి

**ముషీరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** పురాతన ఆలయాల జీర్ణోద్ధరణకు తిరుమల తిరుపతి దేవస్థానం తోడ్పాటును అందించాలని పురాతన ఆలయాల పునరుద్ధరణ ట్రస్ట్ చైర్మన్ ఆర్కే జైన్, ట్రస్టీలు జస్మత్‌పటేల్, రితీషాజాగిర్దార్, ఉమేషశర్మ, వెంకటేషుప్తులు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శనివారం వారు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడిని కలిసి, వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా మన దేశంతో పాటు విదేశాలలో జరుగుతున్న ఆలయ పునరుద్ధరణ పనుల గురించి నాయుడికి వివరించారు. దీనిపై స్పందించిన బీ.ఆర్.నాయుడు పురాతన ఆలయాల పునరుద్ధరణకు టీటీడీ తరఫున పూర్తి సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు.

## 'ఫసిఫిక్ రియల్‌ఎస్టేట్' మోసం..!

### - బాచుపల్లిలో ఫ్లాట్ల యజమానులు ఆందోళన

హైదరాబాద్, జూలై12, ప్రభాతవార్త: రియల్ ఎస్టేట్ రూ.లక్షల్లో వ్యాపారాలు.. సొంతింటి కల కోసం పైసాపైసా కూడబెట్టుకుంటే ఇల్లు దక్కకుండా మోసాలకు పాల్పడుతున్నారు రియల్ వ్యాపారులు. ఓ గుజరాతీ బిల్డర్ ఫ్లాట్ల యజమానులను పత్రాలు ఇవ్వకుండా కాలయాపన చేయడంతో శనివారం నిర్మాణ భవనం ముందు ఆందోళనకు దిగారు. తొమ్మిదేళ్ల క్రితం గుజరాత్‌కు చెందిన నెబ్యుల ఫసిపిక రియల్ ఎస్టేట్ భవనం బాచుపల్లిలో ఉంది. రేరా అనుమతి సైతం పొందాడు. ఫ్లాట్లు విక్రయిస్తున్నట్లు ప్రచారాలు చేయడంతో పలువురు ఆసక్తి చూపి విడతలవారీగా రూ.లక్షల్లో చెల్లించినట్లు చెబుతున్నారు. మరికొందరు రిజిస్ట్రేషన్ చేసుకున్నారని చెప్తున్నారు. అయితే గడువు పూర్తయిన ఫ్లాట్లను తమకు అప్పగించడం లేదని, కోవిడ్‌కు ముందు నుంచి అప్పుడు..ఇప్పుడు అంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా 30శాతం మిగిలి ఉందన్నారు. తొమ్మిదేళ్లుగా మోసం చేసేందుకు కుట్రపన్నినట్లు తెలుస్తుందని వాపోయారు.

## కల్లు కాంపౌండ్‌పై ఎక్సైజ్‌శాఖ దాడులు

### మూడు ప్రత్యేక బృందాలతో తనిఖీ

### శాంపిల్స్‌సేకరణ..అనుమతి లేని దుకాణం సీజ్

**హైదరాబాద్, జూలై 12,ప్రభాతవార్త:** ఎక్సైజ్ స్టేట్ టాస్కోర్స్ టీములు శనివారం నగరంలోని మూడు చోట్ల దాడులు నిర్వహించాయి. ఎక్సైజ్ శాఖ కమిషనర్ హరి ఆదేశాల మేరకు శనివారం ఎస్టీఎఫ్ ఏ టీంలీడర్ అంజిరెడ్డి ఆధ్వర్యంలోని బృందం శేరిలింగంపల్లి,సిద్ధిక్ నగర్‌లో పలుకలు కాంపౌండ్లపై దాడులు నిర్వహించి కల్లు శాంపిల్స్ సేకరించారు. అలాగే అనుమతి లేకుండా నడిపిస్తున్న కల్లు దుకాణం సీజ్‌చేసి సంబంధిత వ్యక్తి పై కేసునమోదు చేశారు. అలాగే ఎస్‌టిఎఫ్ సిటీ వెంకటేశ్వర్లు సిబ్బంది కలిసి బాలానగర్, మూసాపేట్, కైతలాపూర్ ప్రాంతాల్లోని కల్లు కాంపౌండ్లను తనిఖీలు చేసి పలు శాంపిళ్లను సేకరించి ఆయా ఎక్సైజ్ సీఐలకు అప్పగించారు. అలాగే ఎస్ టి ఎఫ్ సీటింగ్ సీఐ నాగరాజు సిబ్బంది కలిసి ముషీరాబాద్ లో 3కాచిగూడలో రెండు కళ్ళు డిపోలను, దుకాణాలను తనిఖీలు నిర్వహించారు.ఇతర దుకాణాలను పరిశీలించి శాంపిల్స్‌ను సేకరించి వాటిని పరీక్షల కోసం ల్యాబ్ కు పంపించినట్లు ఎక్సైజ్ అధికారులు తెలిపారు.

# శరవేగంగా నగరంలో నాలా పూడికతీత పనులు

### హైడ్రా రంగంలోకి దిగడంతో మారిన పరిస్థితి.. ఊపిరి పీల్చుకుంటున్న నగర ప్రజలు

**హైదరాబాద్, జూలై 12,ప్రభాతవార్త:** నగరంలో నాలాల పరిస్థితి బిఫోర్ -ఆఫ్టర్‌లా మారింది. హైడ్రా రంగంలోకి దిగడంతో నాలాల్లో, కల్వర్టులవద్ద పూడికతీత పనులు పెద్దఎత్తున జరుగుతున్నాయి. హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలు, డిఆర్ఎఫ్ బృందాలు సంయుక్త ఆధ్వర్యంలో కల్వర్టులు క్లియర్ అవుతున్నాయి. ప్లాస్టిక్ వ్యర్థాలు, థర్మోకోల్, చెత్త, పిచ్చి మొక్కలను తొల గించడంతో పూడుకుపోయిన నాలాలు, కల్వర్టులు తెరుచుకున్నాయి. లారీలకొద్దీ చెత్తను తొలగించడం తో వరద సాఫీగా వెళ్లేందుకు మార్గం సుగమం చేస్తున్నారు. తొలగించిన చెత్తను వెంటనే పరిసరాల్లో నుంచి తరలించడంతో నివాసితులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ నెల 1వ తేదీ నుంచి హైడ్రా మాన్సూన్ ఎమర్జెన్సీ టీంలు, హైడ్రా డిఆర్ఎస్ బృందాలు సంయుక్త ఆధ్వర్యంలో ఆపరేషన్ నాలా, కల్వర్టుల క్లీనింగ్‌పనులు మొదలయ్యాయి. పరిధిలో మొత్తంనాళాలను, కల్వర్టులను, ముంపు ముప్పు ఉన్న ప్రాంతాలను ఈ బృందాలు జల్లెడ పట్టాయి. జిహెచ్ఎంసి, జలమండలి సహకారం తో నాలాలు, కల్వర్టుల క్లీనింగ్ పనులను ముమ్మ రం చేశాయి. వర్షం పడినప్పుడు వరద నీరు నిల బడకుండా, రోడ్లపై ట్రాఫిక్ జామ్ ఏర్పడకుండా పర్యవేక్షించే బృందాలు... వర్షంలేని ఖాళీ సమయాన్ని నాళాలు, కల్వర్టులు, మ్యాన్ హాల్స్ క్లియర్ చేసే పనుల్లో నిమగ్నమయ్యాయి. హైడ్రా అధికారులు క్షేత్రస్థాయి లో సర్కిళ్లవారీ ఈ బాధ్యతలను పర్యవేక్షిస్తున్నారు. మురుగు, వరదనీరు ముందుకు కదలకుండా ఉక్కిరి బిక్కిరైన నాళాలు,కల్వర్టులు హమ్మయ్య అని సేద దీరుతున్నాయి.కాలువ పరిసరాల్లో నివాసముం టున్న ప్రజలు ఊపిరిపీల్చుకుంటున్నారు. కాలువల్లో నీరు



నాలాల్లోని చెత్తను తొలగిస్తున్న హైడ్రా సిబ్బంది

### పోగొట్టుకపోయిన బాధితుల ఫోన్లు అందజేత

**హైదరాబాద్, జూలై12, ప్రభాతవార్త:** వివిధ కారణాలతో పోగొట్టుకపోయిన విలువైన ఫోన్లను శనివారం బాధితులకు అందజేశారు. బంజారాహిల్స్,జూబ్లీహిల్స్ పరిధిలో 67ఫోన్లు పోయాయని డయల్ 100కు పలువురు బాధితులు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఏసీపీ ఎస్.వెంకట్‌రెడ్డి వివరాలను వెల్లడించారు. క్షేత్రస్థాయి పోలీసులు ఫిర్యాదుదారులు చెప్పిన ప్రదేశంలోని టెక్నాలజీ, జీపీఎస్ ట్రాకింగ్‌లతో గుర్తించి రికవరీ చేసినట్లు పేర్కొన్నారు. టెలికాం సర్వీస్, టెక్నాలజీ నిపుణుల సహకారంతో ఫోన్లు లభ్యమయ్యాయని చెప్పారు. బంజారాహిల్స్ పోలీస్‌స్టేషన్ పరిధిలో 19కాగా జూబ్లీహిల్స్‌లో 22, మాసాబ్‌ట్యాంక్‌లో 17, ఫిల్మ్‌నగర్‌లో 9 ఫోన్లను గుర్తించినట్లు వెల్లడించారు. డీఐలు బషీర్ అహ్మద్, డి. శ్రీనివాస్, ఎండీ. యాసిన్ అలీ, సురేందర్‌లు పాల్గొన్నారు.

### నేడు పాతబస్తీలో అమ్మ వారి ఘటాల ఊరేగింపు

**చార్మినార్, జూలై 12 ప్రభాతవార్త :** ఉమ్మడి దేవాయాల ఊరేగింపు కమిటి ఆధ్వర్యంలో ఈ నెల 13వ తేదీ ఆదివారం మధ్యాహ్నం గంటలకు అమ్మ వారి ఘటాల ఊరేగింపు అత్యంత వైభవంగా జరుగుతుందని ఉమ్మడి దేవాయాల ఊరేగింపు కమిటి చైర్మన్ జి.రాఘవేందర్ తెలిపారు. శాలిబండలోని శ్రీ కాశీవిశ్వనాధ్ మందిరం నుంచి అమ్మ వారి ఘటాల ఊరేగింపు ప్రారంభం అవుతుందని,పలు ప్రాంతాలలో ఊరేగింపు కొనసాగిన అనంతరం ఆలయాలలో అమ్మ వారి ఘటం ప్రతిష్ఠాపన జరుగుతుందని ఆయన తెలియజేశారు.ఈ ఊరేగింపులో పాతబస్తీకి చెందిన 22 దేవాలయాలకు చెందిన వారు శ్రీ అమ్మ వారి ఘటాలతో ఊరేగింపులో పాల్గొంటారని రాఘవేందర్ తెలిపారు.

## నీటి సంపులో పడి బాలుడు మృతి



అభి(ఫైల్‌ఫొటో)

**గచ్చిబౌలి, జూలై 12, ప్రభాతవార్త:** ఓ బాలుడు నీటి సంపులో పడి మృతి చెందినసంఘటన మియాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మహబూబ్ నగర్‌కు చెందిన శ్రీను, నీల దంపతులు బ్రతుకుదెరువు కోసం నగరానికివచ్చి, హఫీజ్‌పేట్ మార్తాండ నగర్‌లో నివాసం ఉంటూ, కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. వీరికి ఒక కూతురు అఖిల, కుమారుడు అభి(4) ఉన్నారు. అభి స్థానికంగా అంగన్‌వాడీలో చదువుకుంటున్నాడు. శనివారం ఉదయం కూలి పనుల నిమిత్తం శ్రీను, నీలా వెళ్లాగా, పిల్లలు ఇంటి వద్ద ఉన్నారు. ఇంటి పరిసరాల్లో అడుకుంటు నీటి సంపులో అభి పడిపోయాడు. స్థానికులు గమనించి సంపులో నుండి బాలుడిని తీసి అస్పత్రికి తరలించారు. డాక్టర్లు పరీక్షించి బాలుడు అప్పటికే మృతి చెందాడని తెలిపారు. యాజమని నిర్లక్ష్యం వల్ల తమ కుమారుడు మృతి చేందాడని ఆందోళన వ్యక్తం చేశారు. సంపు మూత పెట్టించమని పలుమార్లు తెలిపిన యజమాని పెట్టించుకోలేదని, అతని నిర్లక్ష్యం వల్లనే మా బాబు మృతి చెందాడని కుటుంబ సభ్యులు యజమాని ఇంటి ముందు ఆందోళనకు దిగారు. ఈ మేరకు మియాపూర్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

### అప్పుడే పుట్టిన పాపను రోడ్డు పక్కనే వదిలి వెళ్లిన తల్లి



నిలోఫర్ హాస్పిటల్లో చికిత్స చేస్తున్న వైద్యులు

**నాచారం, జూలై 12 ప్రభాతవార్త :** పేగు బంధాన్ని మరిచి.. పుట్టిన నిమిషాల వ్యవధిలోనే బిడ్డను రోడ్డు పక్కన వదిలేసి తన దారిన తాను వెళ్లిపోయింది ఓ తల్లి. ఈ హృదయ విదారకరణ సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. స్థానికులు, పోలీసుల కథనం ప్రకారం..రామంతాపూర్ వివేక్‌నగర్ మూసీ సమీపంలో అప్పుడే పుట్టిన మగశిశువు శనివారం ఏడుస్తూ కనిపించడంతో స్థానికులు 108కి సమాచారం అందించారు. 108 సిబ్బంది అక్కడికి చేరుకుని శిశువుకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం ఉప్పల్ పోలీసుల సహాయంతో నీలోఫర్ ఆసుపత్రికి తరలించారు.అమ్మ వెచ్చని స్పర్శలో హాయిగా నిద్రించాల్సిన పసికూన రోడ్డుపక్కన ఏడుస్తూ కనిపించడం స్థానికులను తీవ్రంగా కలిచివేసింది. శిశువును ఎవరు వదిలి వెళ్లారనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. బాబు ఆరోగ్యంగానే ఉన్నట్టు వైద్యులు తెలిపారు.

# బోనాల చెక్కుల పంపిణీలో స్వల్ప ఉద్రిక్తత

### కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల పోటాపోటీ నినాదాలు

**సికింద్రాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** సీతాఫల్‌మండిలోని సికింద్రాబాద్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ప్రాంగణంలో గల మల్టీపర్పస్ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన బోనాల చెక్కుల పంపిణీ కార్యక్రమంలో స్వల్ప ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నేతల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. ప్రభుత్వం ద్వారా అందజేసే బోనాల చెక్కుల పంపిణీలో ప్రోటోకాల్ పాటించడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఫోటో పెట్టకుండానే చెక్కులు పంపిణీ చేయడానికి సిద్ధమవడం ప్రోటోకాల్‌కు విరుద్ధమని కాంగ్రెస్ నేతలు పెద్దపెట్టున నినాదాలు చేశారు. కాంగ్రెస్ నేత ఆదం సంతోష్‌కుమార్ అనుచరులు నినాదాలు చేయగా, బీఆర్ఎస్ నేతలు పజ్జన్న జిందాబాద్ అంటూ నినాదాలు ప్రారంభించారు. గతంలో కూడా ప్రోటోకాల్ పాటించకుండా చెక్కులు పంపిణీ చేయడానికి ప్రయత్నించారని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నేతల మధ్య సాగుతున్న వాగ్వాదానికి విసుగెత్తిన ముఖ్య అతిథులు ప్రభుత్వ సలహాదారుడు వేంనరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మారావుగౌడ్ జరుగుతున్న చెక్కులు పంపిణీ మధ్యలోనే కార్యక్రమంలో నుంచి నిష్క్రమించారు. సికింద్రాబాద్ నియోజకవర్గం పరిధిలో 212 దేవాలయాలకు రూ. కోటీ 12 లక్షల మేరకు నిధుల చెక్కులను ఈ సందర్భంగా అందించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ మోతె శ్రీలత, దేవాదాయ శాఖ డిప్యూటీ కమీషనర్‌లు రామకృష్ణ, వినోద్ కుమార్, కార్పొరేటర్‌లు సామలహేమ, శైలజ, సునిత, ప్రసన్నలక్ష్మి, కాంగ్రెస్ నేతలు ఆదం సంతోష్ కుమార్, మాదిరెడ్డి జలంధర్‌రెడ్డి పాల్గొన్నారు.



చెక్కులను పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న పద్మారావుగౌడ్, వేం నరేందర్‌రెడ్డిలు



చంద్రశేఖర్‌ను సత్కరిస్తున్న సినీ ప్రముఖులు

## ఎఫ్‌టిపిసి రాష్ట్ర అధ్యక్షుడిగా చంద్రశేఖర్

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** భారతీయ చలనచిత్ర అభివృద్ధే లక్ష్యంగా రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ వేదికలపై అనేక సాంకేతిక, వ్యాపారాత్మక సదస్సులను ఏర్పాటు చేసి సినీ పరిశ్రమ మేధోసంపత్తికి వారధిగా కార్యకలాపాలను నిర్వహిస్తున్న ఫిలిం అండ్ టెలివిజన్ ప్రమోషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్‌టిపిసి) తెలంగాణ రాష్ట్ర మీడియా డైరెక్టర్‌గా గాజుల చంద్రశేఖర్ నియమితులైనారు. ఆ సంస్థ అధ్యక్షుడు జంగా చైతన్య, కార్య దర్శి విజయ్‌వర్మ తదితరులు ఆయనకు నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా జంగా చైతన్య మాట్లాడుతూ అంతర్జాతీయ సాంకేతికను అందిపుచ్చుకోవడం ఇతర రాష్ట్రాలవారు, దేశాలవారు తెలంగాణలో చిత్రీకరణ జరుపుకునేలా ప్రోత్సహించడానికి తమ సంస్థ కృషి చేస్తుందన్నారు. విజయ్‌వర్మ మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి ఆశయాల మేరకు హైదరాబాద్‌ను అంతర్జాతీయ చిత్రపరిశ్రమకు అడ్డాగా మార్చేందుకు కృషి చేస్తానని చెప్పారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ తెలంగాణ, స్థానిక కళాకారులు సాంకేతిక నిపుణులకు జాతీయ స్థాయిలో అవకాశాలు దక్కేలా కృషి చేస్తానని చెప్పారు.

## ఇంజనీర్స్ సంస్థకు రమణనాయక్, మర్రి రమేష్ ఎన్నిక



రమణ నాయక్, రమేష్‌లను సన్మానిస్తున్న దృశ్యం

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** ప్రతిష్ఠాత్మకమైన ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా తెలంగాణ కేంద్రానికి చైర్మన్‌గా ఆచార్య డా. రమణనాయక్, కార్యదర్శిగా మర్రి రమేష్ ఎన్నికయ్యారు. శనివారం ఖైరతాబాద్‌లోని సంస్థ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో వారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రెండేళ్లపాటు వీరు ఈ పదవిలో కొనసాగుతారు. దేశ వ్యాప్తంగా విస్తరించిన ఈ సంస్థకు తెలంగాణలో హైదరాబాద్ తో పాటు వరంగల్, కొత్తగూడెం, రామగుండం లలో కేంద్రాలు ఉన్నాయి. సివిల్, మైనింగ్ ఇంజనీర్లకు నిపుణుల సలహాలు, వర్క్ షాపులు నిర్వహిస్తూ అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లుతున్న ఈ సంస్థకు 105 ఏళ్ల ఘన చరిత్ర ఉంది. తెలంగాణ ఆవిర్భవించిన తరువాత ఈ సంస్థ చేపట్టిన అనేక కార్యక్రమాలతో పలుసార్లు దేశంలోనే ప్రముఖ కేంద్రంగా హైదరాబాద్ లోని ఖైరతాబాద్ కేంద్రానికి పురస్కారాలు లభించాయి. చిత్తశుద్ధితో మంచి కార్యక్రమాలు నిర్వహించి సంస్థకు మరింత ఉన్నత గౌరవం కల్పించే దిశగా కృషి చేస్తామని నూతన అధ్యక్ష, కార్యదర్శులు రమణ నాయక్, మర్రి రమేష్ తెలిపారు. ఇంజనీర్లకు వృత్తిపర నైపుణ్యం పెంపొందించేందుకు కృషి చేస్తామని చెప్పారు. తమపై నమ్మకం ఉంచి ఎన్నుకున్నందుకు వారు సభ్యులకు, పూర్వ చైర్మన్లకు కృతజ్ఞతలు తెలిపారు.

## ఐఎఎస్ అధికారులతో కమిటీని వేసి సమస్యను పరిష్కరించండి

### ఎన్జీవోల ఇళ్ల స్థలాల సాధన సమితి



ఇళ్ల స్థలాలు ఇవ్వాలంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న ఉద్యోగులు

**హైదరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** ఐఎఎస్ అధికారులతో కూడిన ఉన్నత స్థాయి కమిటీని ఏర్పాటు చేసి ఎన్జీవోల తుది అర్హుల జాబితాను ప్రకటించాలని గచ్చిబౌలి ఎన్జీవోల ఇళ్లస్థలాల సాధన సమితి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. ఈమేరకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సమితి అధ్యక్ష కార్యదర్శులు పాండురంగారావు నర్సింగరావులు మీడియాతో మాట్లాడారు. ప్రభుత్వ ఉద్యోగుల ఏళ్ల నాటి కల ఎన్జీవోల స్థలాలని అన్నారు. ఏళ్ల తరబడి ఇళ్ల స్థలాల కోసం వేచి చూస్తున్నా ఎలాంటి ముందడుగు పడకపోవడం విచారకరమన్నారు. వివిధ కారణాలతో న్యాయస్థానాలలో నలిగినా తమ కేసు కొలిక్కి వచ్చినా అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు ఇప్పటికీ అందకపోవడం విచారకరమని అన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో ఏర్పాటు చేసుకున్న ఏపీ ఎన్జీవోల అనంతరం రెండుగా చీలిన విషయాన్ని గుర్తుచేశారు. తుది అర్హుల జాబితాను తేల్చేందుకు భాగ్యనగర్ టీఎన్జీవోస్ సంఘమే కారణమని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఐఎఎస్ అధికారులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసి తుది అర్హుల జాబితాను ప్రకటించి వారికి ఇళ్ల స్థలాలను కేటాయించాలని కోరారు. అదేసమయంలో భాగ్యనగర్ టిఎన్జీవోల పేరిట జరుగుతున్న అక్రమాలను గుర్తించి తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆరోపించారు.

## విద్యార్థులకు నైతిక విలువలు నేర్పించాలి

### తొమ్మిదవ నిజాం ప్రిన్స్ మీర్ అజమత్ అలీఖాన్

**చార్మినార్, జూలై 11 ప్రభాతవార్త :** విద్యార్థులకు చదువుతో పాటు నైతిక విలువలు నేర్పించిన వలసిన గురుతర బాధ్యతల ఉపాధ్యాయులపై ఉందని తొమ్మిదివ నిజాం ప్రిన్స్ మీర్ అజమత్ అలీ ఖాన్ అన్నారు. పాత బస్తీ పురానీ హవేలిలోని ముకరం జా స్కూల్‌లో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన పదివ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. తొమ్మిదివ నిజాంగా బాధ్యతలు నిర్వహించిన నిజాం ప్రిన్స్ మీర్ అజమత్ అలీ ఖాన్ మొదటి సారి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆశిస్తున్నానని తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనపరిచిన పది మంది విద్యార్థులకు తమ ట్రస్ట్ తరుపున స్కాలర్ షిప్‌లు అందజేసి ఉన్నత విద్య చదువు కోవటానికి సహకరిస్తామని ఆయన తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నిజాం ట్రస్ట్ సభ్యులు నవాజ్ ఫైజ్ ఖాన్, నవాజ్ ఫైజ్ బిన్ జంగ్, ఖలీల్ అహ్మద్‌తో పాటు ముకరం జా పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## సేవాలాల్ సేన రాష్ట్ర ఆర్గనైజేషన్ ప్రధాన కార్యదర్శిగా కృష్ణనాయక్

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుడు, అనేక ఉద్యమాల్లో పాల్గొన్న డాక్టర్ బుల్లెట్ కృష్ణనాయక్ సేవాలాల్ సేన రాష్ట్ర కార్యనిర్వాహక ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు అంగోతు రాంబాబునాయక్ ఆయన నియామకాన్ని ధృవీకరించారు. శనివారం బాగ్‌లింగంపల్లిలో సేవాలాల్ సేన రాష్ట్ర కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం జరిగింది, ఈ సమావేశంలో డాక్టర్ బుల్లెట్ కృష్ణ నాయక్ నియామకాన్ని ప్రకటించారు. రాష్ట్ర అధ్యక్షులు రాంబాబు నాయక్ గారు మాట్లాడుతూ బుల్లెట్ కృష్ణనాయక్ తెలంగాణ ఉద్యమంలో చేసిన పోరాటం చాలా కీలకమని కొనియాడారు, జాతి కోసం ఆయన సేవలు ఎంతో అవసరమన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ భూక్యా రవి రాథోడ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు పాత్లావత్ రవి నాయక్, గ్రేటర్ హైదరాబాద్ ఇంచార్జ్ ధరావత్ గణేష్‌నాయక్, నిజాంబాద్ జిల్లా అధ్యక్షులు బుక్య సీతారాం నాయక్ గారు తదితరులు పాల్గొన్నారు.



బుల్లెట్ కృష్ణనాయక్‌కు నియామకపత్రాన్ని అందించిన దృశ్యం

# విద్యా వ్యవస్థ పటిష్టతకు ప్రభుత్వ సంకల్పం అభినందనీయం

### ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు

**హైదరాబాద్, జూలై 12 ప్రభాతవార్త**

విద్యా వ్యవస్థను పటిష్టం చేయటానికి ప్రజా ప్రభుత్వ సంకల్పం అభినందనీయమని ఎస్‌టిఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరకొండ సైదులు అన్నారు. తక్కువ ఆర్థిక భారం గల ఉద్యోగుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. శనివారం నగరంలోని మింట్ కాంపౌండ్ వద్దగల ఎస్‌టిఎఫ్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో సైదులు మాట్లాడారు. వేలాది కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాలలను గ్రామీణ విద్యార్థుల చదువులకు ఎంతో లాభం చేకూర్చుతుందన్నారు. ఉపాధ్యాయులకు 22 వేలమందికి ప్రమోషన్లు సునాయసంగా ఇవ్వడం 15 వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయడం, పిల్లల పౌష్టికాహారం కోసం వారి మెనూ ఛార్జీలను రెట్టింపు చేయడం వంటి నిర్ణయాలన్నీ విద్యావ్యవస్థకు బంగారు బాటలు ప్రజాప్రభుత్వం వేస్తోందన్నారు. ప్రభుత్వానికి అతి తక్కువ ఆర్థిక భారం కలిగిన కొన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని అందులో ముఖ్యంగా గత ప్రభుత్వం పీడ కలగా మిగిల్చిన 317 జీవో బాధితులు వేలాది మంది తీవ్రంగా బాధలు పడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వారికి వెంటనే ఉపశమనం కలిగించి వారి స్థానిక జిల్లాలకు బదిలీ చేయాలని, రాష్ట్రంలో సుమారు 700 ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుల పోస్టులను వెంటనే భర్తీ చేయాలని దానికంటే ముందుగా బదిలీలను చేసి ప్రమోషన్లు నిర్వహించాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో 24 జిల్లా విద్యా శాఖ అధికారి పోస్టులు ఖాళీగా ఉన్నాయని వాటిని వెంటనే భర్తీ చేయాలని కోరారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పనిచేయుచున్న కాంట్రాక్ట్ ఒకేషనల్ అధ్యాపకులకు క్వాలిఫికేషన్ నిర్ధారణ చేసి, పోస్టులను మంజూరు చేస్తూ టైం స్కేలు ఇవ్వాలని కోరారు. కేజీబీవీ మహిళా ఉపాధ్యాయులకు సెలవులను 27 వరకు పెంచాలని ఉద్యోగ నియామకాలలో వారికి వెయిటేజ్ కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న దేవరకొండ సైదులు

## ముగిసిన ఎఫ్‌డిపి సదస్సు

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** నేడున్న పరిస్థితుల్లో పరిశోధనలు ఎక్కువగా జరగాల్సిన అవసరం ఉందని ప్రొఫెసర్ రామకృష్ణ అన్నారు. ఆదివారం బాగ్‌లింగంపల్లి డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ అటానమస్ కళాశాలలో సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో ఐదు రోజుల పాటు ఎఫ్‌డిపి సదస్సు ముగిసింది. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ ప్రొఫెసర్ విష్ణుప్రియ, డైరెక్టర్ యాదగిరి, ప్రిన్సిపల్ డాక్టర్ శేఖర్ మట్ట నిర్వాహకులు హెచ్వోడీలు, అధ్యాపకులు వివిధ కళాశాలల నుండి పాల్గొని ప్రయోజనాన్ని పొందారు. ఈ కార్యక్రమంలో భాగంగా ఉస్మానియా వర్సిటీ ప్రొ. పాట్రిక్ పరిశోధనలో భాగంగా సర్వే డిజైన్, ప్రశ్నావళి ఏవిధంగా తయారు చేసుకోవాలో, పరిశోధనలో సరైన ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌ను ఏవిధంగా ఉపయోగించుకోవాలి అనే అంశాల్ని సోదాహరణంగా వివరించారు. కార్యక్రమం కోఆర్డినేటర్ డాక్టర్ డి.వెంకటరమణ, టి.అశోక్‌గౌడ్, డాక్టర్ బి.శ్రీధర్, ఎం.శ్రేణిక్ తదితరులు పాల్గొన్నారు. ప్రధానంగా విద్యాసంస్థల్లో అందులో ఉన్నత విద్యలో వైద్యుల అవసరం ఎంతో ఉందన్నారు. పత్ర సమర్పణలు చేస్తూ వివిధ జర్నల్స్ యుజిసి వంటి వాటిలో కనీసం సంవత్సరానికి రెండు పత్ర సమర్పణలు చేయాల్సి ఉంటుందన్నారు. పరిశోధన చేసినట్లయితే ఆర్థిక సహాయం అందించే ఐసిఎస్ఎస్ఆర్, యుజిసి వంటి సంస్థల ద్వారా సెమినార్లు వర్క్ షాప్ లు సంస్థలు నిర్వహించుకోవచ్చు అన్నారు. ఐసీఎస్ఎస్ఆర్ దక్షిణప్రాంత కేంద్రం జాకబ్ కల్లె మాట్లాడుతూ గుణాత్మకంగా, పరిమాణాత్మక, పరిశోధనలు వివిధ రంగాల్లో పరిశోధన చేయవచ్చని, మార్కెట్లోని రెండు వస్తువులను గాని రెండు కంపెనీలనుగాని తులనాత్మకంగా పరిశీలించి పరిశోధన చేయవచ్చని ఉదాహరించారు. ఉస్మానియా వర్సిటీ రిటైర్డ్ ప్రొఫెసర్ చెన్న బసవయ్య స్ట్రక్చర్ ఆఫ్ అకాడమిక్ రైటింగ్ అనే అంశంపై అవగాహన కల్పించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ చక్రవర్తి మాట్లాడుతూ ప్లేగరిజం గురించి వివరిస్తూ పరిశోధన చేసే సందర్భంలో ప్లాగరిజం విషయంలో కాపీయింగ్ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

## కాంగ్రెస్ నాయకులకు క్షీరాభిషేకం



బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న డివిజన్ అధ్యక్షులు గణేష్

**జగద్గిరిగుట్ట, జూలై 12, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాజీ టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సా రెడ్డి భూపతిరెడ్డి ఆదేశాల మేరకు శనివారం 126 డివిజన్ జగద్గిరిగుట్ట బస్టాప్ పరిధిలోని బి.ఆర్.అంబేద్కర్ విగ్రహానికి పుల మల వేసి అనంతరం డివిజన్ అధ్యక్షులు గణేష్ ఆధ్వర్యంలో ఏఐసీసీ అగ్ర నాయకులు రాహుల్ గాంధీ, అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, టిపిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌ల చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు నరేందర్ రెడ్డి, భరత్, రషీద్, ఘోరే, స్వాతి, బుచ్చి రెడ్డి, సంజీవ్ రెడ్డి, ఆర్కే రాజేష్, అఖిల్, అనిత్ రెడ్డి, మాధవి రెడ్డి, కౌసల్య, యాదగిరి, మురళి, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

## పాఠశాల స్థాయిలోనే పిల్లలకు టీకాలు వేయించాలి

**చిక్కడపల్లి జూలై 11 ప్రభాతవార్త:** వ్యాధుల నుండి పిల్లలను రక్షించడానికి పాఠశాల వయస్సు నుండే టీకాలు వేయించాలని ప్రముఖ వైద్యుడు డాక్టర్ ఎల్.నాగేశ్వరరావు అన్నారు. శనివారం చిక్కడపల్లిలో జరిగిన అవగాహన కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. పిల్లలకు డిఫ్తీరియా, ధనుర్వాతం, కోరింత దగ్గు, పోలియోకు వ్యతిరేకంగా బూస్టర్ డోస్‌ను సకాలంలో అందించాలని, బాల్యంలో అందించే టీకాలు ముందస్తు రక్షణకు పునాది వేసినప్పటికీ, రోగనిరోధక శక్తి కాలక్రమేణా బలహీనపడుతుంది. అందుకే పిల్లలకు నాలుగు, ఆరు సంవత్సరాల మధ్య ఆ రక్షణను మరింత బలోపేతం చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఇండియన్ నేషనల్ ఇమ్యునైజేషన్ ప్రోగ్రామ్ (ఎన్‌ఐపి) కింద 6, 10, 14 వారాలలో డీటీపీ టీకాలు, 16 నుండి 24 నెలలకు బూస్టర్‌తో కూడిన టీకాలు వేయాలని, పోలియో టీకాలు 6, 14 వారాలలో పాక్షిక మోతాదులలో ఇవ్వబడతాయని, అయితే, నాలుగు సంవత్సరాల వయస్సులో యాంటీబాడీ స్థాయిలు గణనీయంగా తగ్గుతాయని అధ్యయనాలు సూచిస్తున్నాయన్నారు. "పాఠశాల ప్రవేశ వయసులో బూస్టర్ టీకాలు ఇమ్యూనైజేషన్ షెడ్యూల్‌లో ఒక ముఖ్యమైన తనిఖీ కేంద్రంలా పనిచేస్తుంది. ఇది ఏదైనా తప్పిపోయిన లేదా ఆలస్యమైన మోతాదుల కారణంగా ఎదురయ్యే సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. నిరంతర ప్రయత్నాల కారణంగా నియంత్రణలో ఉన్న వ్యాధుల నుండి మన మొత్తం రక్షణను బలోపేతం చేస్తుంది" అని డాక్టర్ రావు జోడించారు.

## వెంకటరామశాస్త్రి స్వరంలో ఆర్ద్రత

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** 'జలజాక్షవర్ణంలో, హంసధ్వనిరాగంలో సూర్యకాంతపుత్ర డాక్టర్ పుచ్చా వెంకటరామశాస్త్రి గానం చేసి అందరి నుంచి ప్రశంసలు అందుకున్నారు. కిన్నెర ఆర్ట్ థియేటర్స్ ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్య సూర్యకాంతపుత్ర డాక్టర్ పుచ్చా వెంకటరామశాస్త్రి 'విష్ణువైభవం' పేరుతో సంగీతానందలహరి సంగీత కచేరి కార్యక్రమం చిక్కడపల్లి శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో జరిగింది. అద్భుతంగా గానం చేసిన వెంకటరామశాస్త్రిలను నిర్వాహక సంస్థ అధినేత మద్దాళి రఘురామ్ ఘనంగా సత్కరించి అభినందించారు. కార్యక్రమంలో కిన్నెర సంస్థ ప్రతినిధి సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. మృదంగంపై పి.జనార్దన్, వయోలిన్‌పై కొండపల్లి శ్రీనివాస్ వాద్యసహకారాన్ని అందించారు. వెంకటసుబ్బయ్య, పట్నం సుబ్రహ్మణ్యం, మైసూరు వాసుదేవాచార్య, స్వాతి తిరునాళ్ళు, త్యాగరాజస్వామి, కొండపల్లి శ్రీనివాస్ విరచిత కీర్తనలు శాస్త్రీయంగా స్వరరాగ యుక్తంగా గానంచేశారు. మద్దాళి రఘురామ్ మాట్లాడుతూ విఖాత గాయకుడు బాలమురళీకృష్ణ తర్వాత ఆ స్థాయిలో శాస్త్రీయ సంగీత గానగోష్ఠి చేస్తున్న వారు తెలుగునాట అంతగా లేరని ఆవేదన వ్యక్తం చేశారు. వెంకటరామశాస్త్రి గణాంకితులనీ, వారి స్వరంలో తాళంలో ఆర్ద్రత ఉట్టిపడుతుందన్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల జెఎసి నూతన కార్యవర్గం



తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి

**చిక్కడపల్లి జూలై 12 ప్రభాతవార్త:** రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఉద్యమకారుల ఆకాంక్షలపై, తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో అమరులైన కుటుంబాలను ఆదుకునే విషయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్రకమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. చిక్కడపల్లిలోని తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర కార్యాలయంలో సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంది. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను సాధించుకునే దిశగా ఉద్యకారుల ప్రయాణం సాగుతున్న క్రమంలో కొంతమంది అరాచకవాదులు తమ వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాల కోసం తెలంగాణ ఉద్యమకారుల జేఏసీలో చీలికలు తెచ్చి సంస్థను నిర్వీర్యం పరిచే కుట్రలను పసిగట్టి వారిని సంస్థ నుంచి బహిష్కరిస్తున్నామన్నారు. వారికి జేఏసీతో ఎటువంటి సంబంధం లేదని తెలిపారు. తెలంగాణ ఉద్యమకారుల జేఏసీ రాష్ట్ర నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. ముఖ్యసలహాదారులుగా బోయపల్లి రంగారెడ్డి, సలహాదారులుగా శంకరరావు, అన్వర్ పటేల్, గొల్లపల్లి దయానంద్, గౌరవ అధ్యక్షుడిగా ప్రొఫెసర్ ఎం. కోదండరామ్, అధ్యక్షుడిగా తుమ్మల ప్రఫుల్‌రాంరెడ్డి, ఉపాధ్యక్షులుగా మోహన్ బైరాగి, అంజలి కుమారి, కంచర్ల బద్రి, జె.ఇందిర, పి.లక్ష్మాకాంతమ్మ, ప్రధాన కార్యదర్శిగా కె.చంద్రన్న, బాకారం లావణ్య, ఎవి.రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా తుల్జారెడ్డి, మంచాల వెంకటస్వామి, మార్వాడి సుదర్శన్, సంయుక్త కార్యదర్శులుగా కాంపల్లి సాయిలు, హరికృష్ణ, సాంస్కృతికవిభాగం రాష్ట్ర కన్వీనర్‌గా వేముల యాదగిరి, రాష్ట్ర కోకన్వీనర్‌గా కొయ్యడ రాజేశ్ ఎన్నికైనవారిలో ఉన్నారు.

## సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్త అరెస్టు

కంటోన్మెంట్, జూలై 12 ప్రభాతవార్త: ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం రోడ్డు వెడల్పులో నష్టపోతున్న బాధితరులకు న్యాయం చేయాలని రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్, జేఏసి చైర్మన్ తెలుకుంట సతీష్ గుప్త డిమాండ్ చేశారు. శనివారం ఉదయం రాష్ట్ర ముఖ్య మంత్రి శామీర్‌పేట్‌లోని నాల్సార్ కళాశాలలో జరిగే వేడుకలకు ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వెళ్ళారు. విషయం తెలుసుకున్న తెలుకుంట సతీష్ గుప్త తిరుగు ప్రయాణంలో రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ ప్లే కార్డులు చేతబూని రాజీవ్ రహదారిలో నిరసన తెలుపాలని జేఏసి గ్రూప్‌లో పోస్ట్ చేశాడు. విషయం తెలుసుకున్న ఇంటలీజెన్స్ నిఘా విభాగం పోలీస్‌లకు సమాచారం అందించారు. దీంతో తెలుకుంటను కార్ఖాన పోలీసులు అరెస్టు చేసి వ్యక్తిగత పూచీ కత్తుపై విడుదల చేశారు.



సామాజిక కార్యకర్త తెలుకుంట సతీష్ గుప్తను అరెస్టు చేసిన కార్ఖాన పోలీసులు

# కొత్త తరం రాస్తున్న కవిత్వానికి ఈ కవి లేఖలు ఒక పరామర్శ

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** కొత్త తరం రాస్తున్న కవిత్వానికి ఒక పరామర్శ తగుళ్ల గోపాల్ ధాన్యపురాశి కవి లేఖలు, నాగిళ్ల రమేష్ ఎంపలి కవి లేఖలు అని ప్రొఫెసర్ కాశీం, ప్రముఖ విమర్శకులు, రచయిత డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ అన్నారు. యువ కవి పేర్ల రాము అధ్యక్షతన జరిగిన తగుళ్ల గోపాల్ కవి లేఖలు ధాన్యపురాశి, నాగిళ్ళ రమేష్ కవి లేఖలు ఎంపలి పుస్తకాలను ప్రొఫెసర్ కాశీం, డాక్టర్ సంగిశెట్టి శ్రీనివాస్ ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ యువతరం ఎలాంటి కవిత్వం రాస్తుందో తెలియాలంటే ఈ రెండు పుస్తకాలు ఒక ఉదాహరణగా నిలుస్తాయి అని అన్నారు. దర్భశయనం శ్రీనివాసాచార్య, జూకంటి జగన్నాథం వంటి సీనియర్ కవులకు ఈ రచయితలు లేఖలు రాశారు అందులోనూ వారి కవిత్వాన్ని గురించే మాట్లాడతారు. దాని ద్వారా కొత్త రచయితలు ఏం చదవాలో ఒక దిశానిర్దేశం చేసేలా మంచి లేఖలు తెలుగు సాహిత్యానికి అందించారని తెలిపారు. ఆయా కవులను ఒక్క వాక్యంలో చెప్పే శీర్షికలు పెట్టారని తెలిపారు. అధ్యక్షత వహించిన పేర్ల రాము మాట్లాడుతూ ఈ ఇద్దరు రచయితలు కవి సంగమం వేదికగా వారంవారం రాసిన కవిలేఖలే ఇప్పుడు పుస్తకరూపంలో ఒక చోటకు చేర్చారు. ఇద్దరు కలిసే ఈ లేఖలు రాశారు. ఇప్పుడు ఇద్దరూ కలిసే ఆవిష్కరించడం గొప్ప విషయం. ఈ రెండు పుస్తకాలను అంకితం తీసుకున్న కవి యాకూబ్, శిలాలోలితలు మాట్లాడుతూ కవిసంగమం ఇలాంటి ఎందరో మంచి కవులను తెలుగు సాహిత్యానికి పరిచయం చేసిందని, అందుకు ఈ కవి లేఖలు గొప్ప ఉదాహరణలని తెలిపారు. సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన ఈ కార్యక్రమంలో ధాన్యపురాశి పుస్తకాన్ని డాక్టర్ మల్లెగోడ గంగాప్రసాద్, ఎంపలి పుస్తకాన్ని దిలీప్ పరిచయం చేశారు. బొబ్బ రామ్, డా.విరించి విరివింటి, మహేష్ వేల్పుల, కవి లేఖలు రచయితలు తగుళ్ళ గోపాల్, నాగిళ్ల రమేష్, రాజారాం తూముచర్ల, రాజారెడ్డి, ఆశారాజు, అనంతోజు మోహన్ కృష్ణ, నరేష్కుమార్ సూఫీ తదితరులు పాల్గొన్నారు.



గ్రంథాన్ని ఆవిష్కరించిన దృశ్యం





వెంకటేశ్వరరావును సత్కరిస్తున్న అంతర్జాతీయ గాయకుడు త్రినాథరావు

## నిరంతర సేవాతత్పరుడు మేడిది వెంకటేశ్వరరావు

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** నిరంతర సేవాతత్పరుడు మేడిది వెంకటేశ్వరరావు అని అంతర్జాతీయ గాయకుడు, స్వరకిన్నెర చింతలపూడి త్రినాథరావు అన్నారు. సేవే పరమావధిగా జీవితాన్ని గడుపుతున్న గొప్ప మానవతావాది అని అన్నారు. శనివారం అల్లైడ్ ఆర్టిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సేవకులు మేడిది వెంకటేశ్వరరావును ఘనంగా సత్కరించి అభినందించారు. యోగిత, ప్రభంజన్ దంపతులు జంట నగరాల ప్రముఖ గాయని గాయకులతో నిర్వహించిన అద్భుత సినీ సంగీత విభావరి ప్రేక్షకులను ఎంతగానో అలరించింది. ఎంవి.రావు మాట్లాడుతూ, తన జీవితం సమాజ సేవకే అంకితమని పేర్కొన్నారు. కార్యక్రమంలో వంశీ రామరాజు, ఎల్ పి రావు, దైవజ్ఞ శర్మ, వినోద్ బాబు, వెంకట్రావు, తదితరులు పాల్గొని ప్రసంగించారు.

## తొమ్మిది మందికి సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

**చార్మినార్, జూలై 11 ప్రభాతవార్త :** కాంగ్రెస్ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పాటుపడుతున్నదని చాంద్రాయణగుట్ట నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి బోయ నరేష్ అన్నారు. చాంద్రాయణగుట్ట నియోజకవర్గం పరిధిలోని శివాజీనగర్, ఉప్పుగూడ ప్రాంతాలకు చెందిన తొమ్మిది మందికి సిఎంఆర్ఎఫ్ కింద మంజూరైన చెక్కులను ఆయన శుక్రవారం అందజేశారు. సిఎంఆర్ఎఫ్ ద్వారా తొమ్మిది మందికి నాలుగు లక్షల యాభై ఐదు వేల రూపాయలు మంజూరు అయ్యాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు పాల్గొన్నారు.

## బిసిల అభ్యున్నతికి ప్రభుత్వం కృషి

**చార్మినార్, జూలై 11 ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కేబినేట్ ఆమోదం తెలపటం చారిత్రక నిర్ణయమని బహదూర్‌పుర నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి పులిపాటి రాజేష్‌కుమార్ తెలిపారు. తెలంగాణ కేబినేట్ తీసుకున్న నిర్ణయంతో స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్రంలోని బిసిలకు ఎంతో లాభం కలుగతుందని ఆయన తెలియజేశారు. బిసిలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పనకు ఆమోదం తెలిపినందుకు ఆయన కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, సిఎం రేవంత్ రెడ్డి, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌కు పులిపాటి రాజేష్ కుమార్ ధన్యవాదాలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ బిసిల అభ్యున్నతి కోసం కృషి చేస్తున్నదని ఆయన తెలియజేశారు.

## దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లకు అవకాశం ఇవ్వాలి

**చిక్కడపల్లి, జూలై 12 ప్రభాతవార్త:** స్థానిక సంస్థల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ల అమలు కోసం ఆర్డినెన్స్ ద్వారా చట్టసవరణ కోసం ప్రభుత్వం నిర్ణయించడం అభినందనీయమని డెవలప్‌మెంట్ సొసైటీ ఫర్ ది డీఫ్(డిఎస్‌డి) రాష్ట్ర అధ్యక్ష, ఉపాధ్యక్షుడు వల్లభనేని ప్రసాద్, కాటమోని వెంకటేష్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం బాగ్‌లింగంపల్లిలో విలేకరులతో మాట్లాడారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, టిపిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, రాష్ట్ర మంత్రులు పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరిలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్రం విషయంలో తాత్సారం చేయడం దారుణమని, ప్రభుత్వం స్పందించి నిర్ణయించడం సంతోషంగా ఉందని, అలాగే దివ్యాంగులకు స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్‌లకు అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

## 42 శాతం బిసి రిజర్వేషన్ అమలుపై హర్షం



సిఎం రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం చేసిన కాంగ్రెస్ నేతలు

**నార్సింగి, జూలై 12 ప్రభాతవార్త :** త్వరలో జరుగనున్న స్థానిక సంస్థల ఎన్నికలలో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి గండిపేట మండలం వట్టినాగులపల్లి గ్రామంలో కాంగ్రెస్ నాయకులు పాలాభిషేకం చేశారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శిశుపాల్‌సింగ్ నేతృత్వంలో ఈ పాలాభిషేకం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సమయంలో బిసిలకు ఇచ్చిన 42.శాతం రిజర్వేషన్‌ను స్థానిక సంస్థల ఎన్నికల్లో అమలు చేసేందుకు సీఎం రేవంత్‌రెడ్డి, పంచాయతీరాజ్ చట్టం–2018కి సవరణ చేసేందుకు ఆర్డినెన్స్ తీసుకు రావడం శుభపరిణామమన్నారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి నాయకత్వం వర్ధిల్లాలని, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద పెట్టున నినదించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నేతలు బుడాల అరుణ్‌కుమార్ ముదిరాజ్, కుమ్మరి శేఖర్, తారాసింగ్, మల్లేష్ యాదవ్, కృష్ణయాదవ్, దర్శన్‌ముదిరాజ్, లక్ష్మణ్‌రెడ్డి, నరసింహ, యాదగిరి, సాయిరాం, సాయికిరణ్ యాదవ్, శ్రీకాంత్‌యాదవ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కు కాలనీవాసుల కృతజ్ఞతలు

**నార్సింగి, జూలై 12 ప్రభాతవార్త :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ పరిధిలోని తిరుమలహిల్స్ కాలనీకి చెందిన ప్రతినిధుల బృందం శనివారం రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను ఘనంగా సత్కరించి, కృతజ్ఞతలు తెలిపారు. గతంలో తిరుమలహిల్స్ కాలనీలో రోడ్లు వేయాలని పలుమార్లు ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌ను కలిసి వినతిపత్రాలు ఇచ్చారు. ఈ మేరకు ఎమ్మెల్యే స్పందించి సీసీ రోడ్లువేయించారు. దీంతో కాలనీ వాసులంతా కలిసి ఆయన నివాసానికి వెళ్లి శాలువాలతో సత్కరించి, పుష్పగుచ్ఛాలిచ్చి సంతోషంను వ్యక్తం చేశారు. నిత్యం ప్రజల మధ్యనే ఉంటూ, ప్రజల సమస్యలు వేగంగా పరిష్కరిస్తుండడం వల్లనే రాజేంద్రనగర్ నియోజకవర్గ ప్రజలు వరుసగా నాలుగుమార్లు అసెంబ్లీకి పంపించారని కాలనీ అధ్యక్షులు సంజీవ్, ప్రధాన కార్యదర్శి రత్నాకర్, కాంగ్రెస్ నేత హరీష్‌గౌడ్‌లు పేర్కొన్నారు. ఐదోసారి కూడా రాజేంద్రనగర్ నుంచి ప్రకాశ్‌గౌడ్ బంపర్ మెజారిటీతో అసెంబ్లీకి వెళ్తారని, ఇక్కడి ప్రజలకు ఆయన చేస్తున్న సేవలే ఆయనకు ఆశీర్వాదాలు అవుతున్నాయని, ఓట్లుగా మారుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ పెద్దలు జ్ఞానేశ్వర్, ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాలకు రూ.27 లక్షల చెక్కులు పంపిణీ

**అత్తాపూర్, జూలై 12 ప్రభాతవార్త :** బోనాల జాతర ఉత్సవాలు సందర్భంగా శనివారం మైలార్‌దేవ్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, శాస్త్రిపురం డివిజన్ల పరిధులలోని ఆలయాలకు చెందిన కమిటిల ప్రతినిధులకు రాష్ట్ర ప్లానింగ్ కమిషన్ చైర్మన్ చిన్నారెడ్డితో కలిసి రాజేంద్రనగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ రూ.27 లక్షల రూపాయల చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ మాట్లాడుతూ బోనాల పండుగ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక అని, బోనాల జాతర ఉత్సవాలను ప్రజలు వైభవంగా జరుపుకునేందుకు ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ మోహన్ రెడ్డి, ఆలయ ఏవో రమాదేవి, సిద్దులగుట్ట ఏవో రామశర్మ, వివిధ ఆలయాల కమిటీల ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పండుగల ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియచేయాలి

**ముషీరాబాద్, జూలై 12, ప్రభాతవార్త:** మన సంస్కృతి, సాంప్రదాయాలను, మన పండుగల ప్రాధాన్యతను విద్యార్థిదశ నుండే పిల్లలకు తెలియచేయాలని తెలంగాణ అడ్వకేట్ జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. శనివారం కవాడిగూడలోని ఇంగ్లీష్‌యూనియన్ పాఠశాల ఆవరణలో ప్రీ బోనాల వేడుకలు భక్తి భావంతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎల్లమ్మతల్లి, పోతురాజు వేషాలతో, నృత్యాలతో విశేషంగా అలరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్స్‌పాల్ స్వర్ణలత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


తలసాని శ్రీనివాస్‌యాదవ్‌ను కలిసిన బిసీ ఉద్యోగుల సంఘం నేతలు

## ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

### ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్

**కంటోన్మెంట్, జూలై 12 ప్రభాతవార్త:** ఆర్టీసి కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఆర్టీసి బిసి ఉద్యోగుల సంఘం గ్రేటర్ జోనల్ అధ్యక్షుడు గుర్రం పవన్‌కుమార్‌గౌడ్ ఆధ్వర్యంలో శనివారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో తలసానిని మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సికింద్రాబాద్ రీజియన్ అధ్యక్షుడు బాల్‌రాజ్ యాదవ్, ప్రధాన కార్యదర్శి ఇ.నిరంజన్, నాయకులు మహేశ్, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

**ఎమ్మెల్యేకు ఆహ్వాన పత్రిక అందజేత...**

**కంటోన్మెంట్, జూలై 12 ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం బన్సీలాల్‌పేట మెట్ల బావి వద్ద నిర్వహించనున్న బోనాలఉత్సవాలకు హాజరుకావాలని సాంస్కృతిక సారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ శనివారం మారేడ్‌పల్లిలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. బన్సీలాల్‌పేట్ మెట్ల బావి నుంచి శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి దేవాలయం వరకు మహిళా కళాకారుల చే నిర్వహించే బోనాల వేడుకల్లో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.

## గురుకుల, వసతి గృహాల్లో విద్యార్థులకు సీట్లు పెంచాలి


మాట్లాడుతున్న రవీందర్‌నాయక్

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం గురుకుల విద్యా సంస్థల్లో, ప్రభుత్వ వసతిగృహాల్లో విద్యార్థులకు సీట్లు సంఖ్యను పెంచాలని ట్రైబల్ జెఎసి విజ్ఞప్తి చేసింది. ప్రభుత్వం విద్యార్థులకు కల్పించిన వసతులు, పెంచిన మెస్, కాస్మోటిక్ చార్జీలు తదితర కారణాల వల్ల విద్యా సంస్థలో విపరీతమైన స్పందన విద్యార్థుల తల్లిదండ్రులలో వచ్చిందని జెఏసి తెలిపింది. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జెఎసి చైర్మన్ రాథోడ్ రవీందర్‌నాయక్, అధ్యక్షుడు ధరావత్ సురేష్‌నాయక్ తదితరులు మాట్లాడుతూ ఈ విద్యా సంవత్సరం విద్యార్థుల సంఖ్యకు మించి 50 శాతానికిపైగా దరఖాస్తులు వచ్చాయని, మెరిటి వచ్చిన విద్యార్థులకు సైతం సీట్లు రావడం లేదని విచారం వ్యక్తం చేశారు. నిరుపేద గిరిజనులు వారి పిల్లలను ప్రైవేటు విద్యా సంస్థల్లో చదివే పరిస్థితి లేదని, దీంతో వారు విద్యకు దూరం అయ్యే పరిస్థితి ఉందన్నారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి జోక్యం చేసుకుని గిరిజన గురుకుల పాఠశాలలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ స్కూల్స్‌లో సీట్లును పెంచాలని వారు విజ్ఞప్తి చేశారు.

## పంచాయత్ పరిషత్ అధ్యక్షుడిగా జలీల్ ప్రమాణ స్వీకారం


జలీల్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న పరిషత్ నేతలు

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** తెలంగాణ పంచాయత్‌పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఎం.ఎ. జలీల్ ఏకగ్రీవంగా ఎన్నికైనారు. ఈ మేరకు శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరు సమావేశంలో పరిషత్‌కు చెందిన పలువురు నేతల సమక్షంలో ఆయన ప్రమాణస్వీకారం చేశారు. ఈ ప్రమాణస్వీకారంలో ఆల్ ఇండియా పంచాయత్ పరిషత్ దక్షిణాది రాష్ట్రాల సమన్వయకర్త విజయ్‌వర్మ, జాతీయ కార్యదర్శి జన్ను రామచంద్రయ్య, ఏపి అధ్యక్షుడు ఎం.చిదంబర్‌రెడ్డి, బాలీవుడ్ నటి పూజా గంగూలి, కన్వీనర్ గంగాధర్ పాల్గొన్నారు. విజయ్‌వర్మ మాట్లాడుతూ తెలంగాణ పంచాయత్ పరిషత్ కమిటీ గ్రామ స్వరాజ్య దిశగా కృషి చేయాలని కోరారు. రాబోయే సర్పంచ్ ఎన్నికల్లో గ్రామ సంక్షేమ కోసం కృషి చేసేవారు, విద్యాంతులను పోటీ చేసేలా కార్యచరణ చేపట్టాలని చిదంబర రెడ్డి, రామచంద్రయ్య తదితరులు జలీల్‌కు సూచించారు. జలీల్ మాట్లాడుతూ పంచాయతీరాజ్ చట్టం తూచా తప్పకుండా అమలు జరిగేలా పోరాటం చేస్తామని, గ్రామస్థాయి నుంచి కమిటీలు వేసి పంచాయతీరాజ్ వ్యవస్థ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

## హన్‌మాన్ మందిరంలో పూజలు

**గన్‌ఫౌండ్రి, జూలై 12ప్రభాతవార్త:** చుడీబజార్‌లోని చారిత్రాత్మకమైన హన్‌మాన్ మందిరంలో శనివారం సెట్విన్ మాజీ డైరెక్టర్ ఎస్.ధన్‌రాజ్ మాదిగ దంపతులు హన్‌మంతునికి ప్రత్యేక పూజలుచేశారు. ఆషాడ మాసం శనివారం కావడంతో హన్‌మాన్ మందిరానికి వెళ్లి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ పూజారి ధన్‌రాజ్ దపంతులను ఆశ్వీరదించి ప్రసాదాలను అందచేశారు. ఈకార్యక్రమంలోతదితరులు పాల్గొన్నారు.

## 42 శాతం బిసి రిజర్వేషన్ల అమలును స్వాగతిస్తున్నాం

### జంపన ప్రతాప్

**కంటోన్మెంట్, జూలై 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి ఎస్.రాజేశ్ యాదవ్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ అన్నా నగర్ చౌరస్తాలో కాంగ్రెస్ జాతీయ నేతలు రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా జంపన మాట్లాడుతూ త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు ఆర్డినేన్స్‌కు క్యాబినెట్ మంత్రి వర్గం ఆమోదం తెలిపేందుకు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ నియోజకవర్గానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నేతలు బద్రినాథ్ యాదవ్, చిర్రబోయిన సంతోష్ యాదవ్, శ్యామ్ సన్ రాజు, మారుతీ గౌడ్, మురళీ, నాగేశ్ యాదవ్, బాబురావ్, మహేశ్, గిరి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.


రేవంత్‌రెడ్డికి పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

# శతాబ్దాలుగా రంగ స్థలాన్ని ముందుకు తీసుకెళుతున్న 'సురభి'

### రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ

**రవీంద్రభారతి, జూలై 12 ప్రభాతవార్త :** కుటుంబాలు కుటుంబాలుగా ఒకే నాటక, నాటి, సాంస్కృతిక సంప్రదాయాన్ని అరుదైన అపూర్వమైన అద్భుతమైన సందర్భం ఒక్క సురభి నాటక సమాజానిదేనని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డా. మామిడి హరికృష్ణ తెలిపారు. సాహిత్యంలో ఎన్ని ప్రక్రియలున్నప్పటికి వాటి పరాకాష్ట నాటకమేనన్నారు. అలాగే సమగ్ర, సంపూర్ణ, సమాహార కళ నాటకమని, సమస్త కళల మూర్తీభవించి ఒక్కచోట రంగరించినప్పుడూ వచ్చేది అత్యంత అద్భుతమైన నాటకకళ అన్నారు. సంక్లిష్ట సమగ్ర సంపూర్ణమైనది నాటక సురభి సమాజమని అభివర్ణించారు. సురభి సమాజం శతాబ్దాలుగా ఈ తెలుగు నేలమీద నాటక రంగ స్థలాన్ని ముందుకు తీసుకువెళుతుందని చెప్పారు. సురభి 10 తరాలుగా తమ వారసత్వ సంపదను రాబోయేతరాలకు అందించే దిశగా ప్రయత్నం చేస్తున్న నాటకపరంపర సురభి నాటక సమాజమేనని స్పష్టంచేశారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ, శ్రీవెంకటేశ్వర సురభి థియేటర్ సంయుక్త నిర్వహణలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో సురబి ఆర్.పద్మజవర్మ ఆరు దశాబ్దాల నటనా మహోత్సవం కనులకింపుగా హృదయాలకు హత్తుకుపోయినట్లు జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డా. మామిడి హరికృష్ణ సహనిర్వాహకుడు సురభి జయచంద్రవర్మ, ప్రముఖ కళాకారులు, సురభి కుటుంబ సభ్యులు తదితర ఆత్మీయ అతిథులతో కలిసి 60 వసంతాల నటజీవితంలో 8 వేల ప్రదర్శనలలో నటించగా 3 వేలకుపైగా శ్రీకృష్ణుని పాత్రధారణ పోషించి అశేష ప్రేక్షకుల మన్ననలు, ఇతోధిక ప్రశంసలందుకున్న సురభి ఆర్.పద్మజవర్మ 60 సంవత్సరాల నటనా మహోత్సవం సందర్భంగా ఆర్.పద్మజవర్మ దంపతులను ఘనంగా సన్మానించి శుభాభినందనలు తెలిపి ప్రసంగించారు. పద్మజావర్మ పుట్టుకతోనే బుల్లికళాకారిణిగా పలునాటకాల్లో వివిధపాత్రలు పోషించడం అసాధారణం, అనితరసాధ్యం, మరచిపోలేని గొప్ప విశేషమన్నారు. పుట్టిననాటి ఇప్పటి 60 ఏళ్లవరకు నిరంతరాయంగా నాటకాలలో వివిధపాత్రల్లో నటిస్తూ నాటకకళకే జీవితాన్ని అంకితం చేశారని కొనియాడారు. అన్నింటికీమించి అప్పటివరకున్న సంప్రదాయం ప్రకారం సామాన్యంగా స్త్రీ పాత్రల్ని పురుషులు వేయడం సర్వసాధారణంగా మనం చూసినా పురుష పాత్రల్లో సంప్రదాయానికి భిన్నంగా కొత్త సంప్రదాయానికి శ్రీకారంచుట్టి స్త్రీ నటించి మెప్పించడం ఆర్.పద్మజవర్మకే చెల్లిందన్నారు. చివరిగా తెలుగుజాతి వారసత్వ కళ అయిన నాటకాన్ని కాపాడాలి, రాబోయేతరాలకు అందించాలని సురభి నాటక సమాజానికి విజ్ఞప్తిచేశారు. సభకు ముందు పద్మజవర్మ శ్రీకృష్ణుడి పాత్రలో ఎంతో అలవోకగా పద్యాలను పాడుతూ అద్భుతంగా నటించి తన్మయుల్నిచేసి మంత్రముగ్ధ లను చేసింది.


సురభి పద్మజవర్మ దంపతులను సన్మానిస్తున్న మామిడి హరికృష్ణ, ప్రముఖులు, సురభికుటుంబసభ్యులు


రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న మహాలక్ష్మి, రామన్‌గౌడ్

## సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** రాష్ట్ర క్యాబినేట్ బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించేందుకు ఆర్డినెన్స్‌ను జారీ చేస్తామని ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శనివారం ఓల్డ్ ఎమ్మెల్యే క్వార్టర్స్ చౌరస్తాలో సిఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. హిమాయత్‌నగర్ డివిజన్ కార్పొరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ ఆధ్వర్యంలో పాలాభిషేకం జరిగింది. పాలాభిషేకం చేసిన మహాలక్ష్మీరామన్‌గౌడ్ మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమెతోపాటు పిసిసి ఉపాధ్యక్షుడు రామన్‌గౌడ్ మాట్లాడుతూ అన్నివర్గాల ప్రజలకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వంలోనే న్యాయం జరుగుతుందని, ఇందుకు నిదర్శనం బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు కల్పించడమేనన్నారు. సామాజిక న్యాయం కోసం కృషి చేస్తున్న లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ, సిఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, పిసిసి అధ్యక్షుడు బి.మహేష్‌కుమార్‌గౌడ్‌కు వారు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు.

**పేట్‌బషీరాబాద్‌లో...**


క్షీరాభిషేకం చేస్తున్న పార్టీ శ్రేణులు

**పేట్‌బషీరాబాద్, జూలై 12, ప్రభాతవార్త :** 132 జీడిమెట్ల డివిజన్ ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున కార్గే లోక్ సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆశయ సాధనలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తూ ముఖ్యమంత్రి అధ్యక్షతన నిర్వహించిన క్యాబినెట్ సమావేశంలో తీర్మానం చేసిన సందర్భంగా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇంచార్జ్ కొత్త కాపు శివసేనారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా అధ్యక్షులు హరివర్ధన్‌రెడ్డి, కుత్బుల్లాపూర్ నియోజకవర్గం ఇంచార్జ్ కోలన్ హన్మత్‌రెడ్డి, నర్సారెడ్డి భూపతి రెడ్డి ఆదేశాల మేరకు శనివారం మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఉపాధ్యక్షులు దమ్మని శ్రవణ్ కుమార్, డివిజన్ అధ్యక్షులు బేకు శ్రీనివాస్‌ల ఆధ్వర్యంలో ఎన్ హెచ్ 44 జీడిమెట్ల విలేజ్ గాంధీ విగ్రహం దగ్గర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు గోరిగే బాలప్పగారు, పిట్ల ప్రవీణ్, మధుసూదన్ రెడ్డి, రంగయ్య, మహిళా కాంగ్రెస్ అధ్యక్షులు సుజాత యాదవ్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ఎన్ లక్ష్మి ‌ ్మ, బేకు పల్లవి, నాగమ్మ, సి హెచ్ లక్ష్మి ‌ ్మ, రేవతి, భవాని, నవీన్ గౌడ్, ఉద్దమర్రి మురళి, సంతోష్ చారి, యాదగిరి చారి, ఆదిత్య, గోరిగే అంజయ్య, కావలి అనిల్ తదితరులు పాల్గొన్నారు.

**కెహెచ్‌బి కాలనీలో...**

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 12, ప్రభాతవార్త :** బీసీలకు కాంగ్రెస్ పార్టీ పెద్దపేట వేస్తుందని టిపిసిసి ఉపాధ్యక్షుడు కూకట్పల్లి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ పేర్కొన్నారు. రాహుల్‌గాంధీ ఆశయసాధనలో భాగంగా సిఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణలో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడం అభినందనీయమన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించడంపై మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి నివాసంలో రాహుల్ గాంధీ రేవంత్ రెడ్డి, మహేష్ కుమార్‌గౌడ్, బట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్ చిత్రపటాలకు బండిరమేష్‌తోపాటు పార్టీ నాయకులు పరమేశ్వర్ రెడ్డి, నర్సారెడ్డి భూపతిరెడ్డి పాలాభిషేకం చేశారు.

## సిసి రోడ్డు పనులు త్వరగా పూర్తిచేయాలి : కార్పొరేటర్

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 12, ప్రభాతవార్త :** సీసీ రోడ్డు పనులు త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అధికారులకు సూచించారు. శనివారం ఆల్విన్ కాలనీ డివిజన్ ఎల్లమ్మబండ పరిధిలోని దత్తత్రయ కాలనీ సాయిబాబా టెంపుల్ వద్ద నూతనంగా నిర్మించిన సీసీ రోడ్డును డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ రోడ్డుకు ఇరువైపులా అంచులవద్ద మట్టివేయాలని, మంచిగా క్యూరింగ్ చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరాజ్‌గౌడ్, బ్రహ్మానందగౌడ్, పి.ఎల్ ప్రసాద్, పోశెట్టిగౌడ్ పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేను కలిసిన కాపు సంఘం నేతలు...

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 12, ప్రభాతవార్త :** ఇటీవల కొత్తగా నియమితులైన నియోజకవర్గం కాపు సంఘం నేతలు కూకట్పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుని శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కృష్ణారావును శాలువాతో కాపు సంఘంనేతలు ఘనంగా సన్మానించారు. నూతనంగా నియమితులైన కమిటీ సభ్యులకు ఎమ్మెల్యే కృష్ణారావు అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా రిజిస్ట్రేషన్ లోగోను ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం వారు కూకట్పల్లి నియోజకవర్గం బిజెపి ఇన్చార్జి మాధవరం కాంతారావును ఆయన నివాసంలో కలిశారు.

## ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ధన్యవాదాలు

**కెపిహెచ్‌బి కాలనీ, జూలై 12, ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ మంత్రిమండలి తీర్మానించడంపై హర్షం వ్యక్తం చేస్తూ తెలంగాణ రాష్ట్ర బీసీ నాయకులు జర్నలిస్టు తెల్ల హరికృష్ణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘాల జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో వివిధ సంఘాల బీసీ నాయకులు కలిసి చేసిన పోరాట ఫలితమే అని కొనియాడుతూ సంబంధిత చట్ట సవరణకు ఆర్డినెన్స్ జారీ చేసి బీసీలకు స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలన్న నిర్ణయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి తెల్ల హరికృష్ణ ధన్యవాదాలు తెలియజేశారు.

## బాచుపల్లిలో ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్ పర్యటన

**నిజాంపేట్, జూలై 12, ప్రభాతవార్త :** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బాచుపల్లి, ప్రణీత్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీ వాసుల విన్నపంమేరకు మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కూన శ్రీశైలం గౌడ్ శనివారం ప్రణీత్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీలో పర్యటించడం జరిగింది. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మీడియాతో మాట్లాడుతూ గేటెడ్ కమ్యూనిటీ ప్రజల రహదారి సమస్యను తెలుసుకొని ఆ ప్రాంతం ప్రజలకు జరుగుతున్న అన్యాయం పట్ల సంబంధిత అధికారులతో మాట్లాడారు. అనంతరం ప్రణీత్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీగుండా 100 అడుగుల రహదారి ప్రవేశపెట్టే ప్రయత్నాలు నిలిపివెయ్యాలని సంబంధిత అధికారులను కోరారు. ఎన్నో సంవత్సరాల నుండి నివసిస్తున్న ప్రజలను భయభ్రాంతులకు గురిచేయొద్దన్నారు. ప్రణీత్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీగుండా ఏర్పాటుచేసే రహదారి ప్రయత్నలను తీవ్రంగా ఖండించారు. రియల్ ఎస్టేట్ భడా వ్యాపరులు వారి స్వలాభ ప్రయోజనాల కోసం ప్రభుత్వాన్ని, ప్రజలను తప్పుత్రోవ్వా పట్టించే ప్రయత్నం చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కోరారు. ప్రణీత్ ఆంటీలియా కాంపౌండ్ వెనుక భాగంలోని భూమి సర్వే నం.170, ఉప సర్వే నంబర్లు, నిషేధిత జాబితాలో ఉన్నాయని, అదేవిధంగా ఈ విషయాన్ని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, ఇంచార్జ్ మంత్రి శ్రీధర్ బాబు దృష్టికి తీసుకెళ్తానని భరోసా ఇచ్చారు. ఈ భూమిని సర్వే జరిపించి మల్లంపేట నివాసితుల కోసం కమ్యూనిటీ హాల్, ఫంక్షన్ హాల్ వంటి ప్రజా ప్రయోజనార్థ కార్యక్రమాల కోసం వినియోగిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రణీత్ ఆంటీలియా వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మహేష్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు శ్రీరాజ్ రెడ్డి, కమ్యూనిటీ వాసులు, అధికారులు పాల్గొన్నారు.


ప్రణీత్ ఆంటీలియా గేటెడ్ కమ్యూనిటీలో పర్యటిస్తున్న కూన శ్రీశైలంగౌడ్

## ఆర్డినెన్స్‌తో బిసి రిజర్వేషన్‌లకు చట్టబద్ధత లభించదు

### లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరాజేశ్వర్‌రావు

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్‌లపై సిఎం రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకువచ్చే ఆర్డినెన్స్‌కు చట్టబద్ధత లభించదని, ఇది ముమ్మాటికి బిసిలను మోసం చేసే కుట్రని భారత జాతీయ లోక్‌దళ్ పార్టీ జాతీయ కార్యదర్శి, రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరాజేశ్వర్‌రావు ఆరోపించారు. శనివారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీకి బిసి రిజర్వేషన్‌లపై చిత్తశుద్ధి ఉంటే కేంద్ర ప్రభుత్వాన్ని ఒప్పించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్డ్‌లో చేర్చితే కాంగ్రెస్, బిజెపి పార్టీలు బిసిలకు మేలు చేసినట్లవుతుందన్నారు. బిసిల పేరుతో దేశవ్యాప్తంగా ముద్రవేసుకున్న ప్రధాని నరేంద్రమోదీ బిసి రిజర్వేషన్‌లపై ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి చేపట్టిన కులగణనకు చట్టబద్దత లేదని, సాక్షాత్తు జస్టిస్ ఈశ్వరయ్య కుండబద్దలు కొట్టారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ తన చిత్తశుద్ధిని బహిర్గం చేయాల్సిన సమయం ఇదేనని, బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌ల భద్రతపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ నోరువిప్పాలని రాజేశ్వర్‌రావు డిమాండ్ చేశారు.

## పొలిటికల్ జస్టిస్‌ను పాటించని పార్టీలను బహిష్కరించాలి

### పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్ విజిఆర్ నారగోని

**సైఫాబాద్, జూలై 12 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్‌లు అమలు చేయడానికి ఆర్డినెన్స్ జారీ చేయాలని నిర్ణయించడం పట్ల పొలిటికల్ జస్టిస్ ఫ్రంట్ ఛైర్మన్ విజిఆర్ నారగోని, పొలిటిషయన్స్ జెఎసి అధ్యక్షుడు నాగుల శ్రీనివాస్‌యాదవ్ స్వాగతం పలికారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 243డి6, 243 టూ టి6ల ప్రకారం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎలాంటి మార్పులనైనా చేసుకోవడానికి పూర్తి అధికారం కల్పించిందని చెప్పారు. శనివారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం బిసిల రిజర్వేషన్‌లలో మూడు గ్రూపులుగా కేటగిరిగా విభజించి అమలు చేయాలని, 1. సంచార కులాలు, 2. ఎంబిసి కులాలు, 3.జనాభా ఎక్కువగా ఉన్న బిసి కులాలుగా వర్గీకరణ చేయాలని డిమాండ్ చేశారు. దీంతో రిజర్వేషన్ ఫలాలు అందరికి దక్కుతాయన్నారు. పొలిటికల్ జస్టిస్‌ను కల్పించని ప్రతి రాజకీయ పార్టీని బహిష్కరించాలని, ప్రజాస్వామ్య బద్దంగా పని చేయని పార్టీలు రాష్ట్రంలో ఉండటానికి వీలులేదని, రాష్ట్రంలో ఉండాలంటే ప్రతిపార్టీ పొలిటికల్ జస్టిస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. బిసిలకు ప్రభుత్వం ప్రాముఖ్యతలేని పదవులు ఇవ్వడాన్ని వారు ఖండించారు.

## రాంనాథ్ దేవాలయంలో పూజలు

**బేగంబజార్, జూలై 12 ప్రభాతవార్త:** ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని బేగంబజార్ డివిజన్ పరిధిలో ఉన్న చారిత్రాత్మకమైన రాంనాథ్ దేవాలయంలో అంగరంగ వైభవంగా పూజలు ప్రారంభమయ్యాయి. దేవాలయంలో జరిగిన పూజ కార్యక్రమంలో నగరంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలి వచ్చారు. బిజెపి నాయకులు రమేష్‌లాల్ యాదవ్ కుటుంబ సభ్యులతో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతియేటా మాదిరిగానే ఈ యేడు కూడా ఆలయంలో అంగరంగ వైభవంగా పూజలను నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో తదితరులు పాల్గొన్నారు.

## బోయన్‌పల్లిలో కళ్లద్దాలు పంపిణీ

**కంటోన్మెంట్, జూలై 12 ప్రభాతవార్త:** కంటోన్మెంట్ నియోజకవర్గంలోని పేద ప్రజలకు నిరంతరం సేవ చేయడమే ధ్యేయమని కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ కుమారుడు, ఎస్‌జిఎఫ్ ఫౌండేషన్ నిర్వాహకులు ముకుల్ తెలిపారు. బోయిన్‌పల్లి పెన్సన్‌లైన్‌లో ఇటీవల నిర్వహించిన మెగా హెల్త్ క్యాంప్‌లో 153 మందికి కంటి చూపు సక్రమంగా లేక పోవడంతో వారికి అదునాతన పరికరాలను కంటి ఆపరేషన్లు, అద్దాలు ఉచితంగా అందజేశామన్నారు. కంటోన్మెంట్ ప్రజలకు నిరంతరం ఎస్.జి.ఎఫ్. ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్, సీనియర్ కాంగ్రెస్ నాయకులు ముప్పిడి మధుకర్, మారుతీ గౌడ్, బల్వంత్‌రెడ్డి, సదానంద్ తదితరులు పాల్గొన్నారు.

## రాంబాబు ఆరోపణలు అవాస్తవం : ఏసిపి

**పంజగుట్ట, జూలై 12 (ప్రభాతవార్త):** యూసుఫ్‌గూడ ఎల్ఎన్‌నగర్‌కు చెందిన రాంబాబు ఎలియాస్ మహ్మద్ కొద్ది నెలలుగా జూబ్లీహిల్స్ పోలీసులు, అధికారులు, సిబ్బందిపై ఎలాంటి ఆధారాలు లేకుండా అసత్య ఆరోపణలు చేస్తున్నారని జూబ్లీహిల్స్ ఏసీపీ ఓ ప్రకటనలో వివరణ ఇచ్చారు. అతని మైనర్ కుమారుడిని పోలీసులు కొట్టారని, ఆ బాలుడి కాళ్లు చచ్చుపడిపోయాయంటూ పోలీసులపై ఆరోపణలు చేయడం బాధాకరమన్నారు. వాస్తవానికి గత యేడాది యూసుఫ్‌గూడ ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి తమ కుటుంబ సభ్యులు స్నానం చేస్తుండగా ఈ మైనర్ బాలుడు సెల్‌ఫోన్‌లో వీడియో తీస్తున్నారని ఫిర్యాదు చేయడం జరిగింది. కేసునమోదు చేసి కేవల విచారణ చేసి పంపించడం, ఆ కేసులో లభించిన ఆధారాలు కోర్టుకి సమర్పించడం జరిగింది. ఐతే కేసునమోదు చేసిన నాలుగునెలల తర్వాత రాంబాబు అసత్య ఆరోపణలు చేయడం గమనార్హమని ఏసీపీ వివరించారు. అతని ఆరోపణలపై విచారణ చేయగా ఆ మైనర్ బాలుడికి జన్యు సంబంధిత వ్యాధితో కాళ్లు చచ్చుబడిపోయినట్లు తేలింది. ఇందుకు సబంధించిన మెడికల్ రిపోర్ట్‌లుసేకరించడం జరిగిందని ఆయన తెలిపారు. తమ స్టేషన్ సిబ్బంది కానీ, అధికారులు కానీ ఆ బాలుడిని కొట్టలేదని, నిర్బంధించలేదని ఏసీపీ తెలిపారు. ఇవన్నీ నిరాధార ఆరోపణలు మాత్రమేనని ఆయన కొట్టిపారేశారు.

## బోనాల ఏర్పాట్లకు రంగం సిద్ధం : గొల్లకిట్టు

**కంటోన్మెంట్, జూలై 12 ప్రభాతవార్త:** సికింద్రాబాద్ మారేడ్‌పల్లి శ్రీ మైసమ్మ బోనాల ఉత్సవాలు బారీ ఎత్తున నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేస్తున్నట్లు ఆలయ పౌండర్ చిర్రబోయిన క్రిష్ణయాదవ్(గొల్లకిట్టు) తెలిపారు. శనివారం మారేడ్‌పల్లిలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 20,21 తేదీల్లో బోనాలు, పలహారం బండి ఊరేగింపు బారీ ఎత్తున నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. 20న బోనాలు, పలహారం బండి ఊరేగింపులు 21న సాయంత్రం నిర్వహిస్తున్నామన్నారు. వేడుకలకు, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎంపీ ఈటల రాజేందర్, ఎమ్మెల్యేలు తలసాని శ్రీనివాస్‌యాదవ్, పద్మారావుగౌడ్, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంత రావ్‌లు విచ్చేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ నిర్వా హకుడు తిరుమల్ వంశీ, కాంగ్రెస్ నేతలు సి.వైష్ణవియాదవ్, సురవి శ్యామ్‌సుందర్‌రెడ్డి, నర్సింగ్‌రావ్, సాయిప్రసాద్, బొట్టు రాజు పాల్గొన్నారు.

## విద్యార్థులు విలువైన సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

**రామ్ కుమార్ తివారి**

**చార్మినార్, జూలై 12 ప్రభాతవార్త :** విద్యార్థులు తమ విలువైన సమయాన్ని అన్ని విధాల సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యాభ్యాసం కోసం కృషి చేయాలని దక్షిణ భారత్ కన్య కుబ్జ్ సభ అధ్యక్షులు రామ్ కుమార్ తివారి అన్నారు. పాతబస్తీ అంబికానగర్‌లోని దక్షిణ భారత్ కన్య కుబ్జ్ సభ ప్రాంగణంలో శనివారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన సభ తరుపున కేజి టూ పిజి విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలు, బ్యాగులు, పెన్నులు పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో సభ ఉపాధ్యక్షులు రాకేష్ తివారీ, కార్యదర్శి విజయ్ పాల్ పాండే, ప్రతినిధులు రాజేంద్ర ప్రసాద్ తివారి, గోపాల్ ప్రసాద్ శుక్ల, విజయ్ శంకర్ తివారీ, శోభా పాండేతో పాటు పలువురు పాల్గొన్నారు.


IN THE COURT OF THE HON'BLE III ADDL SENIOR CIVIL JUDGE RANGA REDDY DISTRICT: AT: L.B.NAGAR
O.S. NO. 423 OF: 2025

**Between :**
1. Smt. CH. Rama Padma, W/o. Late Ch. Surya Narayana Murthy, Aged about: 63 years, Occ: House wife, Aadhar No. 7601-1364-3118.
2. Sri. CH. Praneeth, S/o. Late Ch. Surya Narayana Murthy, Aged about: 37 years, Occ: Pvt Employee, Aadhar No. 7503-7919-8308.
3. Sri. CH. Rohith, S/o. Late Ch. Surya Narayana Murthy, Aged about: 32 years, Occ: Pvt Employee, Aadhar No. 7309-9931-7481.
[All are R/o. H.No. 11-8-100/2 (Old), 234 (New), Kranthi Nagar, Behind Uco Bank, Saroornagar, L.B.Nagar, R.R.District, Telangana State-500035]. ...Plaintiffs

And
1. The Thasildar Saroornagar Mandal, At: Saroornagar, Ranga Reddy District, Telangana State.
2. All Concerned. .... Defendants

To,
ALL CONCERNED
Please take notice in the above said suit O.S.NO. 423 OF: 2025, has been filed for declaration by the Plaintiffs praying the Hon'ble Court to declare the plaintiffs are the legal heirs of Sri. Late Ch. Surya Narayana Murthyin respect of suit schedule A & B properties which are mentioned herein.If anybody have any objections in this regard please appear before the Hon'ble III Addl Senior Civil Judge Reddy District Court by 10.30 A.M. on Dated: 07-08-2025 by person or through your counsel failing which the matter shall be decided in your absence basing on the merits of the case. **SCHEDULE OF PROPERTY - A:** All that the piece and parcel of plot bearing No. 30 (Residential New House No. 11-8-234, Old House No. 11-8-100/2) admeasuring 213.88. Sq. Yds, equalent to 178.8 Sq. Meters, out of the Lay out approved by HUDA Sy No. 19 Part, Situated at Saroornagar Village & Revenue Mandal & MPP, L.B.Nagar, Ranga Reddy District, Telangana State and bounded by; **NORTH:** Plot No. 31. **SOUTH:** Plot No. 29. **EAST:** Open Space. **WEST:** 30' Feet Wide Road. **SCHEDULE OF PROPERTY - B:** All that the piece and parcel of open land bearing plot no. 68 (Site-A) in Sy. No. 191 & 193 admeasuring 200 Sq. Yds, or equivalent to 167.21 Sq. Metrs, Situated at Pedda Amberpet Village & Grampanchayath, Hayathmagar Mandal (Old), Abdullapurmettu Mandal (New), Ranga Reddy District, Telangna State,, and bounded by; **NORTH:** 40' Wide Road. **SOUTH:** Neighbors Land. **EAST:** Plot No. 69. **WEST:** Plot No. 67.

**B. RADHA KRISHNA**
Advocate
R/o. H.No. 1-75/5/88, Road No.4, Sri Sai Ram Nagar Colony, Boduppal Village, Medipally Mandal, Medchal - Malkajgiri Dsitrict, Telangana. PH: 789137327.


# కొనసాగుతున్న ఆషాడ మాస బోనాల ఉత్సవాలు

**మెహిదీపట్నం, జూలై 12, ప్రభాతవార్త :** ఆషాడ మాస బోనాల ఉత్సవాలు ఆధ్యాత్మిక వాతావరణంలో కొనసాగుతున్నాయి. భక్తులు అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, బోనాలు, నైవేద్యాలను సమర్పిస్తూ మొక్కులు చెల్లించుకుంటున్నారు. చల్లంగా చూడు తల్లి అంటూ వేడుకుంటున్నారు. ఆషాడ మాస బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని శ్రీగోల్కొండ జగదాంబికా మహంకాళి దేవాలయ వృత్తి పనివారి సంఘం ఆధ్వర్యంలో సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పించడం ఆనవాయితీ. ఇందులో భాగంగా వృత్తిపనివారి సంఘం అధ్యక్షులు తంగడపల్లి శివశంకర్ ఆధ్వర్యంలో ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు, ఒడిబియ్యం, కుంకుమ, పసుపు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తంగడపల్లి శివశంకర్ మాట్లాడుతూ...ప్రతి ఏడు మాదిరిగానే ఈ ఏడాది కూడా గోల్కొండ శ్రీ జగదాంబికా మహంకాళి దేవాలయ వృత్తి పనివారి సంఘం ఆధ్వర్యంలో పట్టు వస్త్రాలు, ఒడిబియ్యం, పసుపు, కుంకుమలు అమ్మవారికి సమర్పించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ప్రజలు సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి పాడి పంటలకు తెలంగాణ రాష్ట్రం నిలయంగా మారాలని అమ్మవారిని వేడుకోవడం జరిగిందని తెలిపారు. ప్రత్యేక పూజల్లో వృత్తి పని వారి సంఘం సలహాదారులు నర్సింగ్ రావు, సాయిబాబా చారి, సభ్యులు సుధీర్, దప్పు రవి, శ్రావణ్, శ్రీను, విజయ్, లీలావతి, నవీన్, నరేందర్, కరుణ, శివరాజ్, ధనరాజ్ పాల్గొన్నారు.


అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న వృత్తి పని వారి సంఘం అధ్యక్షులు తంగడపల్లి శివశంకర్.

## విద్యా వ్యవస్థను పటిష్టం చేసేందుకు
### ఉపాధ్యాయులు కృషి చేయాలి




**వికారాబాద్ జిల్లా ప్రతినిధి, జులై 12, ప్రభాతవార్త :** విద్యా వ్యవస్థ ను పటిష్టం చేసేందుకు ఉపాధ్యాయుల కృషి చేయాలని ఉమ్మడి వరంగల్, నల్లగొండ, ఖమ్మం జిల్లాల శాసన మండలి సభ్యులు పింగళి శ్రీపాల్ రెడ్డి అన్నారు. శనివారం వికారాబాద్ పట్టణంలోని సత్యభారతి గార్డెన్‌లో పీఆర్‌టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం జిల్లా అధ్యక్షులు కడియాల వేంకట చంద్ర శేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సీ శ్రీపాల్‌రెడ్డి హాజరై ప్రసంగించారు. పెండింగ్‌లో ఉన్న బిల్లుల ు త్వరగా వచ్చేలా, సీపీఎస్ విధానాన్ని రద్దు చేయాలని అన్నారు. స్కావేంజర్ల సమస్యల ు సైతం, సాధ్యమైనంత వరకు పరిష్కారంచేసేదిశగారాష్ట్రప్రభుత్వందృష్టికి తీసుకెళుతానని తెలిపారు. పీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు గుండు లక్ష్మణ్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పులుగం ధామోదర్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి దోమ అమర్ నాథ్, గౌరవ అధ్యక్షులు వెంకట్ రాంరెడ్డి, జిల్లా నాయకులు పాల్గొన్నారు.

### మైనార్టీ కమ్యూనిటీ హాల్ మంజూరు

**షాద్‌నగర్, (ప్రభాతవార్త, జులై1) :** ఫరూఖ్‌నగర్ మండలం మొగిలిగిద్ద గ్రామంలో అభివృద్ధి పనుల శంకుస్థాపనకు వచ్చిన రేవంత్ రెడ్డిని కలిసిన స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ గ్రామంలో మైనార్టీలు ఎక్కువగా ఉన్నందున షాదీఖానా మంజూరు చేయాలని విజ్ఞప్తి చేయగా సీఎం సానుకూలంగా స్పందించి షాదీఖానా ఏర్పాటుకు హామీ ఇచ్చారు. భవన నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరైన నేపథ్యంలో ప్రొసీడింగ్స్‌ను మొగిలిగిద్ద నాయకులకు అందజేశారు. షాదీ ఖానా మంజూరు చేయించిన ఎమ్మెల్యేను ఈ సందర్భంగా గ్రామ మైనార్టీలు సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు బాల్‌రాజ్ గౌడ్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్ ఖాన్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అంబటి రాజు, నాయకులు మాలి, రవూఫ్, పాష, హాజీ, లతీఫ్, ఖలీల్, బబ్లు, షాబీరన, ఫాజిల్, అమీర్, సమీర్, తబ్రేజ్, అంబటి రంజిత్, భరత్, కుమార్, లడ్డు, తదితరులు పాల్గొన్నారు.

### బిసిల సంక్షేమానికి నాంది

**తలకొండపల్లి, జులై12, ప్రభాతవార్త:** ముదిరాజ్ సంఘం మండల మాజీ అధ్యక్షుడు బోళ్ళ యాదగిరి ముదిరాజ్ స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మరియు రాష్ట్ర మంత్రివర్గం అంతా కలిసి రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మకమ నిర్ణయం అని, భవిష్యత్తులో సామాజిక విప్లవానికి నాంది పలుకుతుందని ముదిరాజ్ సంఘం మాజీ మండల అధ్యక్షుడు బోల్లయాదగిరి ముదిరాజ్ అన్నారు . ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయడానికి రాష్ట్ర క్యాబినెట్ తీసుకున్న నిర్ణయం ద్వారా తెలంగాణ ప్రాంతాల్లో బీసీలు రాజకీయంగా రాణించడానికి అవకాశం ఏర్పడుతుందని అన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయాన్ని తెలంగాణ బీసీ సామాజిక వర్గం స్వాగతిస్తుందని, దీన్ని ఖచ్చితంగా అమలు చేసి చరిత్ర పుటల్లో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు నిలుస్తారని బోల్ల యాదగిరి ముదిరాజ్ సంతోషం వ్యక్తం చేశారు.

### స్లాబ్ కూలి నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు

**ఘట్‌కేసర్ రూరల్, జులై 12, ప్రభాత వార్త:** పోచారం ఐటీ కారిడార్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని వెంకటాపూర్ అనురాగ్ యూనివర్సిటీలో నిర్మాణంలో ఉన్న స్లాబ్ కూలీ నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు అయిన సంఘటన శనివారం చోటు చేసుకుంది. బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డికి చెందిన అనురాగ్ యూనివర్శిటీలో అదనంగా భవన నిర్మాణ చేపట్టగా ఉదయమే పనుల్లో చేరిన కార్మికులు పనిచేస్తుండగా దాదాపు ఉదయం ఆరు గంటల సమయంలో స్లాబ్ కూలిపోగా నలుగురు కార్మికులకు తీవ్రంగా గాయలైనట్లు తెలిపారు. గాయపడిన వారిని వెంటనే తోటీ కార్మికులు దగ్గరల్లోని నీలిమ ఆస్పత్రిలో చేర్పించి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు. సమాచారం తెలిసుకున్న మీడియా ప్రతినిధులు సంఘటన స్థలికి వెళ్లగా మీడియా ప్రతినిధులను లోపలికి అనుమతించలేదు. అనురాగ్ యూనివర్సిటీలో అన్ని అనుమతులతోనే నిర్మాణాలు చేపట్టాం: కళాశాల ఎస్టేట్ ఆఫీసర్ వెంకటాపూర్ అనురాగ్ యూనివర్శిటీలో అన్ని అనుమతులతోనే నిర్మాణాలు జరుగుతున్నాయని కళాశాల ఎస్టేట్ ఆఫీసర్ వి. మధుకర్ రెడ్డివివరణఇచ్చారు. అన్నిఅనుమతులతోనే నిర్మాణాలు జరుగుతుండగా ప్రమాదవశాత్తూ స్లాబ్ కూలీ నలుగురు కార్మికులు కింద పడిపోగా స్వల్పంగా గాయాలైనాయి. గాయపడిని వారిని వెంటనే ఆస్పత్రిలో చేర్పించి వైద్యసేవలు అందిస్తున్నట్లు తెలిపారు.

### ఎంపి రఘునందన్‌రావును కలిసిన న్యాయవాది మహేందర్ రెడ్డి

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జులై12:** కాలికిశస్త్రచికిత్స చేయించుకున్నప్పటికీ అనునిత్యం ప్రజాక్షేత్రంలోఉంటూ వాటి ప్రజల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న సీనియర్ న్యాయవాది, మెదక్ఎంపీ రఘునందర్ రావును ఆయన నివాసంలో కలుసుకున్నట్లు షాద్‌నగర్ సీనియర్ న్యాయవాది చెంది మహేందర్ రెడ్డి తెలిపారు. త్వరగా కోలుకొని రాబోయే పార్లమెంటు సమావేశాల్లో పాల్గొని తనగళం విప్పాలని కోరారు.

### ప్రజలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలి
#### ప్రభుత్వ చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి



**తాండూరు, జులై12, ప్రభాతవార్త:** నిరుపేద ప్రజలకు అందుబాటులో ఉండేవిదంగావైద్యసేవలు అందించ-ాలని తెలంగాణ రాష్ట్ర చీఫ్ విఫ్ పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. తాండూరులో నూతనంగా ఏర్పాటు చేసిన వంశీ న్యూరో ఆసుపత్రిని శనివారం చీఫ్ విఫ్ మహేందర్‌రెడ్డి సందర్శించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి వైద్యుడు అఖిల్‌కు శుభాకాంక్షలు తెలిపారు. పేదప్రజలకు వైద్యం చౌకగా అందేలా చూడాలని మహేందర్‌రెడ్డి సూచించారు. రాష్ట్ర టిపిసిసి ప్రచార సమన్వయకర్త కరణం పురుషోత్తంరావు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ సంపత్‌కుమార్, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాటికొండ స్వప్న, మాజీ కౌన్సిలర్ పరిమళ, నాయకులు బిదర్ రాజశేఖర్, అబ్దుల్‌ఖవి, బిర్కెట్‌రఘు, భగవాన్, పునిత్‌కుమార్, అయ్యూబ్ ఖాన్, శివానంద్, ఆనంద్ గౌడ్ పాల్గొన్నారు.

### –సిఎం రేవంతర్‌రెడ్డిని కలిసిన యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు

**తాండూరు, జులై12, ప్రభాతవార్త** : తెలంగాణరాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని తాండూరు నియోజకవర్గయూత్ కాంగ్రెస్ అధ్యక్షులు తుపాకుల అనిల్ మర్యాద పూర్వకంగా కలిశారు. శనివారం హైదరాబాద్‌లోని నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ ంఢ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు.



తాండూరుప్రాంత సమస్యలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపై సుమారు10 నిమిషాల పాటు ముఖ్యమంత్రిరేవంత్‌రెడ్డితో సన్నిహితంగా మాట్లాడటం జరిగిందని అనిల్ తెలిపారు.

# మహాలక్ష్మిపథకం అమలు చేయకపోతే ఉద్యమమే

**జాగృతి అధినేత్రి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**
**షాద్‌నగర్ పర్యటనలో రేవంత్ సర్కారుపై ఫైర్**

**షాద్‌నగర్, ప్రభాతవార్త, జులై12 :** మహిళలు మహాలక్ష్మి అని వారికి ప్రతినెల రూ.2500ఇస్తానని ఇవ్వలే.. కళ్యాణలక్ష్మీకి తులం బంగారం ఇస్తాననిఇవ్వలే..ఉచిత బస్సులని చెప్పి బస్సులు తగ్గించిండు.. విద్యార్థులకు స్కూటీలు కొనిస్తామని మోసం చేసిండు.. సన్నబియ్యంలో 50శాతం నూకలే.. సీఎం రేవంత్ రెడ్డి సొంత జిల్లాలోనే అమ్మఒడి వాహనాలకు డీజిల్ పోయలేని దౌర్భాగ్యపరిస్థితి..పాలమూరుఎత్తిపోతలప్రాజెక్టునిర్మాణం పనులు చేపట్టకుండా నిర్లక్ష్యం..పేదోడి గుడిసెలు హైడ్రా పేరుతో కూల్చుతారు.. పెద్దోడి ఇంటికి కాపలా ఉంటారు. వచ్చే స్థానిక ఎన్నికల్లో చిత్తుగా ఓడించండి అంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, జాగృతి అధినేత్రి కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రంగారెడ్డి జిల్లాషాద్‌నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం వేములనర్వ, కాకునూరు గ్రామాల్లో కవిత పర్యటించారు. మండలంలోని కాకునూరు గ్రామంలో మహాలక్ష్మీపథకం అమలుకోసం కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీకి పోస్టుకార్డు పంపించి పోస్టు కార్డు ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. కాకునూరు గ్రామంలో మహిళల చేత మహాలక్ష్మీ పథకం అమలులో భాగంగా ప్రతినెల రూ.2500 ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పోస్టుకార్డులను మహిళల చేత పోస్టు బాక్సులో వేయించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఏర్పాటు చేసిన సభలో ఆమె మాట్లాడుతూ.. గత అసెంబ్లీ ఎన్నికల ప్రచారం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నో హామీలను ప్రజలకు ఇచ్చారని, తప్పుడువాగ్దానాలతో గద్దెనెక్కారని విమర్శించారు. కాకునూరు గ్రామంలోనే 1100 మంది మహిళలు ఉన్నారని, ప్రభుత్వం వచ్చి 18 నెలల కాలంలో కనీసం నెలకు రూ.2500 చొప్పున రూ.5 కోట్ల రూపాయలు ఈ ఒక్క గ్రామానికే బకాయి ఉన్నారని కవిత లెక్కలు వేసి మరీ వివరించారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే కళ్యాణలక్ష్మీ పథకంలో ఒక లక్ష రూపాయలతో పాటుతులంబంగారంఇస్తానని చెప్పిన హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. సాక్షాత్తూ సీఎం రేవంత్‌రెడ్డి సొంతజిల్లాలోనేఅమ్మఒడి వాహనానికి డీజిల్ పోయలేని దౌర్భాగ్య పరిస్థితి ఏర్పడిందని మీడియాలో అమ్మఒడి వాహనాన్ని నెట్టుకుంటూ వెళ్లిన వార్తలు పత్రికల్లో చదివానని విచారం వ్యక్తం చేశారు.



సభలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత

కేసీఆర్ ప్రభుత్వ హయాంలో ఇచ్చిన నోటిఫికేషన్లకే రేవంత్ రెడ్డి సర్కారు ఉద్యోగాలు భర్తీ చేసిందని అన్నారు. రాష్ట్ర అభివృద్ధికి పైసా అప్పు పుట్టడం లేదని తెలంగాణ పరువు తీస్తున్నాడని కవిత విమర్శించారు. మూడు నెలల నుండి గ్రామాల్లో పింఛన్లు రాక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, రూ.2 వేల ఫించన్‌ను రూ.4 వేలకు పెంచుతామని చెప్పి మోసం చేశాడని ఆరోపించారు. ప్రభుత్వవసతిగృహాల్లో విద్యార్థులుసరైన సదుపాయాలు లేక చనిపోతున్నారని విచారం వ్యక్తం చేశారు. ఇంత దారుణం ఎక్కడా చూడలేదని అన్నారు. రేవంత్ రెడ్డి అప్పు పుట్టకపోతే కేసీఆర్ మాదిరిగా ఆయన చేసిన పనులనే అనుసరించి చేయవచ్చని ఆయన కొత్తగా చేసేది ఏమీ ఉండదని అన్నారు. మహిళలకు ఉచితబస్సుల పేరిట రేవంత్ సర్కార్ ప్రజలకు అనేక ఇబ్బందులు సృష్టించిందని కవిత అన్నారు. గతంలో కాకునూరు గ్రామానికి ఉదయం, సాయంత్రంరెండుపూటల బస్సులు వచ్చేవని, ఇప్పుడు ఉచిత బస్సు అయ్యాక బస్సులేకుండా అయ్యాయని, ఇక మగవాళ్ల పరిస్థితి దారుణంగా ఉందని, డబ్బులు పెట్టి నిలబడి ప్రయాణించాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. కనీసం గ్రామానికి పది బస్సులైనా ఇవ్వాలని తాను కోరుకుంటున్నానని దీనికి మద్దతుగా చేతులు లేపాలని గ్రామస్థులను కోరారు.

# సామాజిక విప్లవానికి నాంది..కర్ణకర్

**బిసిల చిరకాల కళ నెరవేర్చిన ఘనత సిఎం రేవంత్ రెడ్డిదే..**
**షాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిప్పిశెట్టి కర్ణకర్..**

**కేశంపేట జులై 12 ప్రభాతవార్త:** బిసిల చిరకాల కోరిక బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇచ్చి బీసీలకు సమ న్యాయం చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అని అన్నారు షాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిప్పిశెట్టి కర్ణకర్. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ బీసీలకు రాష్ట్రంలో 42 శాతం రిజర్వేషన్ వచ్చేందుకు కృషిచేసిన షాద్ నగర్ శాసనసభ్యుడు వీర్లపల్లి శంకర్ కు ధన్య వాదాలు తెలిపారు. ఈ సందర్భంగాషాద్ నగర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తిప్పిశెట్టి కరుణాకర్ మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ నుండి తెలంగాణను విభజించి తెలంగాణ ఇచ్చిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వం అని అదే కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం వాటా ఇచ్చి బీసీలకు సముచిత స్థానం కల్పించి రాబోయేస్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లతో చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నందుకు సీఎం రేవంత్ రెడ్డి, టీపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, మంత్రుల బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు పార్టీలకు సంబంధించింది కాదు అని అందరికీ సమన్యాయం జరిగేందుకు తీసుకున్న నిర్ణయం అని కర్ణకర్ అన్నారు. విద్య, ఉద్యోగాలతో పాటు.. స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ బీసీలకు ఈ మేరకు రిజర్వేషన్లు కల్పించే రెండు బిల్లులను ఈ ఏడా మార్చిలో శాసనసభ ఆమోదించిందని అన్నారు. ఇటీవలే జరిగే పంచాయతీ ఎన్నికలకు



సంబంధించిన అంశంపై హైకోర్టు కూడా నెలాఖరులోపు రిజర్వేషన్లు ఖరారు చేయాలని ప్రభుత్వానికి ఆదేశించిన విషయం అందరికీ తెలిసిందే. వీటన్నింటిపై చర్చించిన మంత్రివర్గం స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ప్రభుత్వం తరఫున సీఎం రేవంత్‌రెడ్డి, పార్టీ తరఫున టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్ వ్యూహాత్మకంగా, సమన్వయంతో పనిచేయడం వల్లే ఈ విజయం సాధ్యమైందని బీసీలకు 42 శాతం రిజర్వేషన్ రావడంతో కాంగ్రెస్ ప్రభుత్వానికి అందుకు సహకరించిన మంత్రివర్గ సభ్యులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలిపిన కర్ణకర్ .

## అయ్యప్ప స్వామి ఆలయంలో చోరీ

**మేడ్చల్, జులై 12. ప్రభాతవార్త :** గుర్తు తెలియని దుండగులు ఆలయంలో చొరబడి చోరీ చేసిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం మేడ్చల్ పట్టణంలోని హౌజింగ్ బోర్డు కాలనీలో గల అయ్యప్ప స్వామి ఆలయంలో శుక్రవారం రాత్రి పూజలు నిర్వహించి ఆలయానికి పూజారి తాళం వేసి వెళ్లారు. శనివారం తెల్లవారు జామున వెళ్లగా గుడిలోపల హుండి పగులగొట్టి ఉంది. లోపలికి వెళ్లి చూడగా చెమ్మలు, ఒక ముక్కంటితో పాటు హుండి దొంగతనం జరిగినట్లు గుర్తించారు. ఆలయ నిర్వాహకులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆలయాన్ని విచారించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

### విద్యార్థిని చితకబాది, బూటు కాలితో తన్నిన హెడ్మాస్టర్

**షాబాద్, జులై 12, ప్రభాతవార్త:**




షాబాద్ ప్రభుత్వ బాలుర పాఠశాలలో విద్యార్థిని ప్రధాన ఉపాధ్యాయుడు గోవిందు చితకపాదిన ఘటనపై పిడిఎస్ యు విద్యార్థి సంఘం నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆ సంఘం నాయకుడు రాజేష్ పాఠశాలని సందర్శించి విద్యార్థిని ఏం జరిగిందని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ బాలుర పాఠశాల హెడ్మాస్టర్ గోవింద్ 11న రాకేష్ అని తెలుసుకొని ఇష్టం వచ్చినట్టుగా అబ్బాయిని కొట్టడమే కాకుండా కింద పడిపోయిన తర్వాత బూటు కాలుతో తన్నడం జరిగిందని విద్యార్థి రాకేష్ పిడిఎస్ యు నాయకులకు వివరించారని తెలిపారు. జిల్లా కలెక్టర్ విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం డిమాండ్ చేస్తుందన్నారు.

## మృతుని కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం

**కేశంపేట జులై 12 ప్రభాతవార్త..** కేశంపేట మండల కేంద్రానికి చెందిన జూలపల్లి పెద్ద అంజయ్య శనివారం ఉదయం మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యులకు కేశంపేట తాజా మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి 5000 వేలరూపాయలు, మరియు కేశంపేటకు చెందిన సీనియర్ జర్నలిస్ట్ రమణ గౌడ్ 5000 వేల రూపాయలను మృతుడి కుటుంబ సభ్యులకు అందజేసి సానుభూతి తెలిపారు. జూలపల్లి అనసూయమ్మ, రొయ్యల అంజయ్య, ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు కుక్కల యాదయ్య, కడియాల యాదయ్య, గంజాయి దశరథం, మంచే వెంకటయ్య, లిక్కిశీను, జజాల రాము, మృతుడి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

### నిమ్స్‌లో చికిత్సకు రూ.2 లక్షల ఎల్‌ఓసీ అందజేత

**ఘట్‌కేసర్, జులై 12, ప్రభాతవార్త:**



ఘట్‌కేసర్‌మున్సిపల్‌బాలాజీనగర్ మొహమ్మద్‌వహీద్ అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చికిత్స పొందు తున్నాడు. హైదరాబాద్‌లో నిజామ్స్ ఇని స్ట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (నిమ్స్)లో వైద్యం ఖర్చులు అధికం కావడంతో ముఖ్య మంత్రి సహాయనిధి ద్వారా ఆర్థికసాయం కోసం ధరఖాస్తు చేసుకున్నాడు.

మొహమ్మద్ వహీద్‌కు మెరుగైన చికిత్స అందించేందుకు సీఎం ఆర్ఎఫ్ నుంచి రూ.2 లక్షలు నిమ్స్‌కు మంజూరు కావడంతో శనివారం మేడ్చల్ శాసనసభ్యులు చామకూర మల్లారెడ్డి చేతుల మీదుగా బాధితుని కుటుంసభ్యుదుజహంగీర్‌కుఎల్ఓసీ పత్రాన్ని అందజేశారు. ఈకార్యక్రమంలో ఘట్‌కేసర్ మున్సిపల్ బీఆర్ఎస్‌పార్టీ అధ్యక్షులు బండారి శ్రీనివాస్‌గౌడ్, జామా మస్జిద్ కమిటీ అధ్యక్షులు సయ్యద్ అబ్దుల్‌అజీజ్ పాల్గొన్నారు.

# పాఠశాలలో పురుగుల అన్నమే పరమాన్నం

### విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆందోళన

**మర్పల్లి జులై 12 ప్రభావార్త:**

మండల కేంద్రలోని కస్తూర్బాబాలికల గురుకుల పాఠశాలలో పురుగుల అన్నం వడ్డిస్తున్నారని, మేనూ ప్రకారం బోజనం ఇవ్వడం లేదని, పూరికి బదులు చెపాతి ఇస్తున్నారనిపాఠశాలలో ప్రిన్స్‌పాల్ కొంతమంది విద్యార్థులకు సన్నిహితంగా ఉంటు మిగత విద్యార్థులను పట్టించుకోవడం లేదని శనివారం పాఠశాల విద్యార్థులు తల్లిదండ్రులు మధ్యాహ్నం 12 గంటల సమయంలో ఆందోలనకు దిగతారు. ఈ వ్యవహారంలో పాఠశాల అద్యాపకులు, ప్రిన్స్‌పాల్ ఎవ్వరి వ్యవహార శైలి వారి ఉన్నట్లు ఒక్కరిపై ఒక్కరు ఆరోపణలు గుప్పించారు. పాఠశాలలో సుమారు 250 మంది విద్యార్థీనీలకు పైడానే ఉన్న శనివారంమాత్రం 190 మంది విద్యార్థులు ఉన్నారు. ఐతే ఇక్కడ పలువురు



ఉపాధ్యాయులు నగరం నుండి రోజురాకపోకలటు సాగిస్తుంటారు. పాఠశాలలో సిబ్బంది మద్య విబేదాలు విద్యార్థులను విడదీసి చదువులు

# అభివృద్ధిని చూసి ఓర్వలేకనే.. జైపాల్ యాదవ్ అసత్య ఆరోపణలు

**తలకొండపల్లి జులై 12ప్రభాతవార్త:** కల్వకుర్తి నియోజకవర్గం లోని ఆయా గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేకనే కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అసత్య ఆరోపణలు చేస్తున్నారని తలకొండపల్లి మాజీ మండల ఉపాధ్యక్షులు శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ నాయకులు రేణు రెడ్డిలు విమర్శించారు. శనివారం నాడు తలకొండపల్లి మండలం గట్టు ఇప్పలపల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కల్వకుర్తి నియోజకవర్గానికి పలు అభివృద్ధి పనుల మంజూరి ప్రారంభోత్సవాలకు రాష్ట్ర మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి ,దామోదర్ రాజనర్సింహ, జూపల్లి కృష్ణారావు లు వచ్చి పలు అభివృద్ధి పనులకు మంజూరు చేయడంతో మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ తట్టుకోలేక తలకొండపల్లి మండలంలో ప్రెస్ మీట్ పెట్టి విమర్శిస్తున్నాడని వారన్నారు. గతంలో ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు గట్టు ఇప్పలపల్లి మండలం కోసం గ్రామస్తులందరూ అడిగినచో మండలానికి కావాల్సిన అర్హతలు గట్టు ఇప్పలపల్లి గ్రామానికి లేవని నిర్మొమాటంగా తెలిపి ప్రస్తుతం రాజకీయ పబ్బం గడుపుకోవడానికి గట్టుప్పలపల్లి గ్రామాన్ని మండల ప్రస్తావన తీసుకొస్తు ప్రస్తుత ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మండలం చేయవలసిన



అవసరంఉందనిచెప్పడం ఎంతవరకు సమంజసం అని వారు విమర్శించారు. గట్టుప్పలపల్లి గ్రామానికి గతంలో క్రీస్తు శేషులు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో సబ్ స్టేషన్, మాజీమంత్రి చిత్తరంగా ఆధ్వర్యంలో బీసీ హాస్టల్ భవనం, మాజీ మంత్రినాగంజనార్దన్‌రెడ్డిఆధ్వర్యంలో ప్రభుత్వ ఆసుపత్రి మంజూరయ్యాయని ఇవన్నీ తాను చేసినట్లు గొప్పలు చెప్పుకుంటున్నారని వారు ఎద్దేవా చేశారు. గ్రామానికి గతంలో 100 ఇండ్లు మంజూరు చేయించినట్లు చెప్పుండడం పచ్చి అబద్ధమని అవి ఎవరికిచ్చారో చూపిస్తా? అని వారు ప్రశ్నించారు. ఇప్పటికైనా

## చదువుతో పాటు క్రీడలు ఎంతో అవసరం
### రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి



**షాద్‌నగర్, ప్రభాతవార్త, జులై12 :** విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు, యుద్ధ విద్యలు ఎంతో అవసరమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. పట్టణంలోని సాయిరాజా కన్వెన్షన్ హాల్‌లో కరాటే మాస్టర్ చెన్నయ్య ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర పాఠశాలల క్రీడల కరాటే అసోసియేషన్ 12వ సౌత్ ఇండియా నేషనల్ కరాటే ఛాంపియన్ షిక్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పాలమూరు విష్ణువర్ధన్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన పోటీలలో పాల్గొన్న విద్యార్థులను అభినందించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇస్నాతి శ్రీనివాస్, మోహన్‌సింగ్, చిట్టెం లక్ష్మీకాంత్ రెడ్డి, అత్తాపురం మహేందర్ రెడ్డి, మిద్దె గణేష్, రంగన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

### గర్భిణీ స్త్రీలకు కిట్ల పంపిణీ

**తలకొండపల్లి జులై12, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని లో అంతారం గ్రామంలో శనివారం నాడు గర్భిణీ స్త్రీలకు మెడికల్ కిట్లను పంపిణీ చేశారు. ఉప్పల చారిటబుల్ ట్రస్ట్ నుంచి గ్రామంలోని గర్భిణీ స్త్రీలు అందరికీ ఉచితంగా కిట్లు పంపిణీ చేస్తున్నట్లు గ్రామ మాజీ సర్పంచ్ సడమోని వెంకటయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో రాములు ఎర్రల శీను కాటుమల శీను వెంకటయ్య ఆంజనేయులు మహేష్ ఏఎన్ఎంలు ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్రీయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షురాలిగా అనురాధ

**షాద్‌నగర్, ప్రభాతవార్త, (జులై12:** హిందీ పండితురాలిగా, ఉపాధ్యాయులను చైతన్యపరిచే కోఆర్డినేటర్గఆ జిల్లా వ్యాప్తంగా పేరున్న పి.అనురాధ రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ జిల్లా అధ్యక్షురాలిగా ఎన్నికయ్యారు. నందిగామ మండలంలోని నర్సప్పగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆమె ఉపాధ్యాయురాలిగా పనిచేస్తున్నారు. అదేవిధంగా ప్రధాన కార్యదర్శిగా డాక్టర్ దార్ల రాఘవేంద్ర చారి ఎన్నికయ్యారు. ఆయన ఫరూఖ్‌నగర్ ఉర్దూ మీడియంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్నారు. తెలంగాణ రాష్ట్ర శాఖ తమ విచక్షణాధికారాలను ఉపయోగించి అడ్ హక్ కమిటీ అధ్యఓ, కార్యదర్శులుగా ఎంపిక చేశారు. రాష్ట్రఅధ్యక్షుడు చింతకుంట జగదీష్, ప్రధాన కార్యదర్శి ములకనూరి శంకర్ వీరిని ఎంపిక చేశారు. వీరితోపాటుగౌరవఅధ్యక్షుడు, గౌరవ సలహాదారు, ఉపాధ్యక్షులు, కోశాధికారి తదితరులనుఎంపికచేశారు. తెలంగాణరాష్ట్రంలో శాఖను మరింత బలోపేతం చేయడానికి శక్తివంచన లేకుండా కృషి చేస్తామని అన్నారు.

### ఘనంగా విబిఐటి గ్రాడ్యుయేషన్ డే వేడుకలు

**ఘట్‌కేసర్, జులై 12, ప్రభాతవార్త:** నేటి పోటీ ఉద్యోగ ప్రపంచంలో రాణించాలంటే నైపుణ్యత తప్పనిసరి అని టెక్ మహేంద్రా వైస్ ప్రెసిడెంట్– కెపాబిలిటీ డెవలప్‌మెంట్ హెడ్ నాగార్జున్ మల్లాది అన్నారు. ఘట్‌కేసర్ మున్సిపల్ అవుషాపూర్‌లోని విజ్ఞానభారతి ఇంజనీరింగ్ కళాశాలలో శనివారం18వ గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఐసీఎఫ్ఎఐ ఫౌండేషన్ ఫర్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్‌చాన్సలర్ డా.ఎల్.ఎస్.గణేశ్ ముఖ్యఅతిథిగా పాల్గొనగా టెక్ మహేంద్రా వైస్ ప్రెసిడెంట్– కెపాబిలిటీ డెవలప్‌మెంట్ హెడ్ నాగార్జున్ మల్లాది గౌరవ అతిథిగా హజరై ప్రసంగించారు. ఈసందర్భంగా టాపర్లకు బంగారు పతకాలను వారి చేతుల మీదుగా ప్రధానం చేశారు. బిటెక్, ఎంటెక్, ఎంబిఏలో పట్టభద్రులైన మొత్తం 1,055 మంది విద్యార్థులకు వారి డిగ్రీలను ప్రధానం చేశారు. టప్రముఖ పారిశ్రామిక వేత్త–పాలకమండలి సభ్యుడు డాక్టర్ భానుప్రకాష్ వర్మ, విబిఐటటి డైరెక్టర్ ప్రొఫెసర్ వైవిఎస్ఎస్ఎస్‌వి ప్రసాదరావు, రిజిస్ట్రార్ డాక్టర్ ఎన్.సత్యనారాయణ, డైరక్టర్లు, విభాగాధిపతులు పాల్గొన్నారు. సిఎస్‌ఇ (ఎఐఎంఎల్) విభాగాధిపతి డా.శిరీషరెడ్డి నేతృత్వంలో నిర్వహించిన పట్టభద్రుల దినోత్సవంలో కార్యక్రమ కన్వీనర్–సీఓఈ డా.బి.సతీష్‌కుమార్ అందరికి ధన్యవాదాలు తెలియజేశారు.

### ఎస్.పి.ఎల్.3 క్రికెట్ టోర్నమెంట్ నేడు ఫైనల్ మ్యాచ్

**షాబాద్, జులై 12, ప్రభాతవార్త:** ఏ ఎం ఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గత పది రోజులుగా కొనసాగిన ఎస్.పి.ఎల్.3 క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ఫైనల్ మ్యాచ్ జరగనుందని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ ప్రకటనలో తెలిపారు. షాబాద్ లోని పిఆర్ఆర్ స్టేడియంలో సాయంత్రం మూడు గంటలకు ఫైనల్ మ్యాచ్ ప్రారంభం కానుంది అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా శ్రీ మల్లికార్జున ముత్య (అప్పాజీ), తెలుగు సినిమా నటుడు శ్రీ సంగీత్ శోభన్ (మ్యాడ్ సినిమా హీరో), తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ శ్రీ శివసేన రెడ్డి, చేవెళ్ల నియోజకవర్గం శాసనసభ్యులు శ్రీ కాలే యాదయ్య, రంగారెడ్డి జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మన్ ఎలుగంటి మధుసూదన్ రెడ్డి లు హాజరుకానున్నారనితెలిపారు. క్రీడాకారులు, అభిమానులు, పార్టీ నాయకులు, ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

### కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి అమలు చేసింది

**షాబాద్, జులై 12, ప్రభాతవార్త:** ఉద్యోగాలు, రాజకీయాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేలా కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం చారిత్రాత్మక మని టి.పి.సి.సి. మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ అశ్వాక్ అలి అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ.. గత ప్రభుత్వాలు మాటలతో ప్రజలను మభ్యపెడుతూ వచ్చినా సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో ఇచ్చిన హామీల కట్టుబడి బీసీలకు రాజకీయా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించినట్లు తెలిపారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అంశం పై సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వం, కాంగ్రెస్ పార్టీ తీసుకున్న ఈ నిర్ణయం రాజకీయ నిర్ణయం కాదని సామాజికంగా గొప్ప మార్పుకు నాంది అన్నారు. విద్య, ఉద్యోగం, రాజకీయ రంగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ గత మార్చి నెలలో జరిగిన సమావేశాల్లో బిల్లులకు శాసనసభ ఆమోదించి గవర్నర్ ద్వారా రాష్ట్రపతికి నివేదించిన విషయం తెలిసిందే. అయితే 2018 చట్టాన్ని సవరించి బీసీలకు న్యాయం చేస్తు నిర్ణయం తీసుకోనడం సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఏఐసీసీ అగ్రనేత శ్రీ రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్రలో చేసిన జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు పెంచాలి అన్న డిమాండ్‌ను దేశంలో తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోనే అమలు చేస్తున్నందుకు గర్వంగా ఉదన్నారు. తెలంగాణ సమాజం, ముఖ్యంగా బీసీ సామాజిక వర్గం, సామజిక న్యాయం కోసం పోరాడుతున్న కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

### ఆర్ కృష్ణయ్య ను కలిసిన తోట మహేందర్

**నందిగామ జులై 12 ప్రభాతవార్త:**

బీసీల హక్కుల సాధన కోసం నిరంతరం పోరాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య ను నందిగామ మండల బీసీ సేన అధ్యక్షులు తోట మహేందర్ మర్యాదపూర్వకంగా కలిసినట్లు చెప్పారు. ఈ సందర్భంగా గత కొద్ది రోజులుగా జాతీయ బీసీ సేన అధ్యక్షులు బర్క కృష్ణన్న మార్గదర్శ కత్వంలోచేపట్టిన కార్యక్రమాల విషయమై మాట్లాడినట్లు పేర్కొన్నారు. వెనుకబడిన బీసీలు ఆర్థిక, సామాజిక, రాజకీయ రంగాలలో రాణించే విధంగా కృషి చేయాలని, అదేవిధంగా వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు రాజకీయాల్లో ఎదిగేందుకు కృషి చేయాలని సూచించినట్లు చెప్పారు.

### పేదలకు వరం సీఎం రిలీఫ్ ఫండ్

**కుల్కచర్ల, జులై 12, ప్రభాతవార్త :** సీఎం రిలీఫ్ ఫండ్ నిరుపేదలకు వరం లాంటిదని మార్కెట్ కమిటీ చైర్మన్ బిఎస్ ఆంజనేయులు ముదిరాజ్ అన్నారు. ఆదివారం కుల్కచర్ల మండల పరిధిలోని రామిరెడ్డిపల్లి గ్రామంలో లబ్ధిదారులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రామ్‌రెడ్డి పల్లి గ్రామానికి చెందిన బాసూత్కర్ అంబాభాయ్ కి రూ.40వేలు, కుమ్మరి స్వాతికి 58 వేలు విలువచేసే చెక్కులు మంజూరు అయ్యాయని తెలిపారు. . ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీ అడ్వకేట్ కోసిగి నరసింహులు యాదవ్, గ్రామ కమిటీ అధ్యక్షుడు అ ఎమోని నర్సింలు, పార్టీ నాయకులు ఈడిగి లక్ష్మయ్య, శ్రీనివాస్ రెడ్డి, అ ఎమని బుగ్గయ్య, ఎల్లయ్య, కుమ్మరి కృష్ణయ్య, ఉమ్మడి రమేష్, ఆంజనేయులు, వడ్డే మహేష్, కుమ్మరి యాదయ్య, ముజాహిద్పూర్ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు షర్ఫుద్దిన్, కాకి ఆనందం, కాకి శివ తదితరులు పాల్గొన్నారు.